

నెల్లూరు : కోటమిట్ట షాదీమంజిల్‌లో ముస్లింల కేరింత



మంత్రిగా ప్రమాణం చేస్తున్న పొంగూరు నారాయణ

జిల్లాలో మొత్తం స్థానాలను ఊడ్చేసి తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు దోసిట పోసిన నెల్లూరుకు రాష్ట్ర క్యాబినెట్‌లో సముచిత స్థానం లభించింది. సమర్థులు, అభివృద్ధి కాముకులుగా గుర్తింపు పొందిన పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డిలకు మంత్రివర్గంలో చోటు దక్కింది. ఈ ఇద్దరు మంత్రుల నేతృత్వంలో జిల్లా అభివృద్ధిబాట పట్టనుంది. సుదీర్ఘ కాలం తరువాత జిల్లా నుంచి ఇద్దరు నాయకులకు ఒకేసారి మంత్రివర్గంలో చోటు దక్కడం విశేషం. 2014లో తెలుగుదేశం క్యాబినెట్‌లో తొలుత నారాయణకు ఒక్కరికే అవకాశం దక్కింది. మూడేళ్ల తరువాత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మంత్రి పదవి దక్కింది. 2024 టీడీపీ క్యాబినెట్‌లో తొలి విడతలోనే నారాయణ, ఆనంకు మంత్రి పదవులు దక్కడంతో చంద్రబాబు నెల్లూరు జిల్లా పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపినట్లుగానే టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి.



మంత్రిగా ప్రమాణం చేస్తున్న ఆనం రామనారాయణరెడ్డి

సమర్థులకు సముచిత స్థానం!

చంద్రబాబు క్యాబినెట్‌లోకి పొంగూరు, ఆనం

పడిలేచిన కెరటాలు..

పొంగూరు నారాయణ అను నేను...

ఆనం రామనారాయణరెడ్డి అను నేను..

● ఇక పొంగూరు నారాయణకు పనిరాక్షసుడిగా పేరు. అభివృద్ధి అంటే ఏమిటో, తాను తలుచుకుంటే అభివృద్ధి ఎలా పరుగులు తీస్తుందో ఐదేళ్ల క్రితమే ప్రజలకు రుచి చూపించారు. సుమారు 5వేల కోట్లతో నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేశారు. మున్సిపల్ శాఖ మంత్రి హోదాలో నెల్లూరుతోపాటు ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పేదల కోసం బహుళ అంతస్తుల భవనాల పనులను పరుగులు తీయించారు. నెల్లూరు సిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, మంచినీటి పథకాల పనులను శరవేగంగా చేయించారు. రోడ్లు, పార్కుల రూపురేఖలు మార్చారు. ఆ ఐదేళ్ల కాలంలో నారాయణ చేసిన అభివృద్ధే ఈ ఎన్నికల్లో ఆయనకు కనివినీ ఎరుగని రీతిలో 72వేల ఓట్ల భారీ మెజారిటీ తెచ్చిపెట్టింది.

ఈ మాటలు ఈ ఇద్దరు అన డానికి, 'అనే' అవకాశాన్ని చేజిక్కించుకోవ డానికి వారు చాలా పోరాటాలే చేశారు. వేధింపులను, వేదనలను, అవమానాలను ఎదుర్కొన్నారు. గడచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో నారాయణ అనుభవించిన వేధింపులు అన్నీఇన్నీ కావు. వారానికో కేసు, నెలకో అరెస్టు వారెంటు, ఐటీ, విజిలెన్స్, పోలీస్ ఇలా రకరకాల శాఖల దాడులను ఎదుర్కొన్నారు. నారాయణను అరెస్టు చేసి జైలులో పెడితే చంద్రబాబును పెట్టినట్లే అనే భావన కాబోలు వైసీపీ ప్రభుత్వం నారాయణ మీద ఏదో ఒకవిధంగా కక్ష తీర్చుకోవడానికి ప్రయత్నించింది. అమరావతిలో అక్రమ ఆస్తులు సంపాదించుకున్నాడని నారాయణతో పాటు ఆయన బంధువులను వేధించారు. అమరావతి ఔటర్, ఇన్నర్ రింగ్‌రోడ్లలో అక్రమాలు జరిగాయంటూ కేసులు పెట్టారు. అరెస్టు వారెంట్లు తెచ్చారు. సోదాల పేరుతో మానసికంగా హింసించారు. పదవ తరగతి పరీక్షా పత్రాల లీకేజీ కేసులో నారాయణను ఇరికించడానికి శతవిధాల ప్రయత్నించారు. నారాయణ ఆసుపత్రిలో నకిలీ మందులు వాడుతున్నారని ఆయన నివాసాన్ని జల్లెడపట్టారు. నారాయణ స్కూలు బస్సుల కొనుగోళ్లలో అక్రమాలంటూ నారాయణ కార్యాలయాలతో పాటు అనుచరుల ఇళ్లపైనా పోలీసులు దాడులు చేశారు. ఎలాగైనా నారాయణను అరెస్టు చేయాలని ఆయన వాహనాన్ని ఎన్నోసార్లు వెంబడించారు.

● నెల్లూరు జిల్లా రాజకీయాలను కనుసైగతో శాసించిన కుటుంబానికి పెద్ద దిక్కు అయిన ఆనం రామనారాయణ రెడ్డి సైతం రాజకీయంగా పదేళ్లపాటు నరకం అనుభవించారు. కాంగ్రెస్ పతనంతో రాజకీయంగా నిలదొక్కుకోవడానికి పలు రకాల ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండి కూడా అదే ప్రభుత్వం ద్వారా పలు రకాల అవమానాలు ఎదుర్కొన్నారు. వెంకటగిరి ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఆనం రామనారాయణ రెడ్డికి వైసీపీ అధినేత జగన్ ఆ ఐదేళ్లలో ఏనాడు తగిన గౌరవం ఇవ్వలేదు. అంతేగాక ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే అవమానాలకు గురిచేశారు ఇదేం అన్యాయమని అడగాలని ప్రయత్నించినా అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా అవమానించారు. ఈ అవమానాలను భరించలేక వైసీపీ నుంచి వెలుపలకు వచ్చిన ఆనం రాజకీయంగా నిలదొక్కుకొనే క్రమంలో ఎంతో నలిగిపోయారు. టీడీపీకి ఏమాత్రం అనుకూలంగాలేని ఆత్మకూరులో పోటీ చేయాల్సి వచ్చినా ఆ నియోజకవర్గ ప్రజల మీద నమ్మకంతో బరిలోకి దిగారు. విజయం సాధించారు.


● క్యాబినెట్‌లో మంత్రి పదవులు పొందిన ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ ఇద్దరు సమర్థులనే విషయం ఇదివరకే రుజువయ్యింది. ఆనం మంత్రిగా పనిచేసిన కాలంలో జిల్లాలో పలు అభివృద్ధి పనులు జరిగాయి. నెల్లూరులో ప్రధాన ఆసుపత్రి, మెడికల్ కాలేజీల నిర్మాణం నుంచి ఆత్మకూరు నియోజకవర్గానికి అభివృద్ధి అంటే ఏమిటో పరిచయం చేసిన ఘనత ఆనంది. వాస్తవానికి సంప్రదాయ ఓటర్ల పరంగా గమనిస్తే ఆత్మకూరు నియోజకవర్గం వైసీపీకి పెట్టనికోట. ఆఖరు నిమిషంలో ఆనం ఆత్మకూరులో అడుగుపెట్టి విజయం సాధించారంటే దానికి కారణం టీడీపీ పట్ల ప్రజలకు ఉన్న అభిమానంతోపాటు ఆత్మకూరులో ఆయన చేసిన అభివృద్ధి పనులు కూడా ప్రధాన కారణమనే చెప్పాలి.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

బడికి వేళాయె!

● నేడు స్కూళ్ల పునఃప్రారంభం

వేసవి సెలవులు పూర్తయిపోయాయి. మళ్లీ బడిగంట మోగనుంది. 52 రోజులపాటు ఆటపాటలతో గడిపిన చిన్నారులు గురువారం బడిబాట పట్టనున్నారు. నిన్నటిదాకా నిశబ్దం ఆవహించిన పాఠశాలలు ప్రార్థనా గీతాలతో సందడిగా మారనున్నాయి. నూతన విద్యా సంవత్సరం గురువారం ఆరంభం కానుండగా, ఎప్పటిలాగా ఈసారి కూడా విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. విద్యారంగంలో అనేక మార్పులు చేపడుతున్నా మౌలిక సదుపాయాల కల్పనలో లోటు కనిపిస్తూనే ఉంది. ఓ వైపు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు హంగు, ఆర్భాటాలతో విస్తృత ప్రచారం చేస్తూ ఎక్కువశాతం మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తుండగా సర్కారు బడుల్లో వెన్నాడుతున్న సమస్యలతోనే కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులతో అందంగా తీర్చిదిద్దుతున్నామని, నాణ్యమైన విద్యావిధానం అందచేస్తామని ప్రకటనలు చేస్తున్నా బడులు తెరిచే నాటికి ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి.



- నెల్లూరు (విద్య)

ఊరూరా సంబరం

కొత్త ప్రభుత్వం ఏర్పాటుతో కూటమి శ్రేణుల హుషారు



నెల్లూరు : నాయకులకు కేక్ తినిపిస్తున్న కోటంరెడ్డి

నెల్లూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో జిల్లావ్యాప్తంగా సందడి కనిపించింది. తెలుగుదేశం పార్టీ కార్యాలయాల వద్ద బాణాసంచా పేలుస్తూ, స్వీట్లు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. పలుచోట్ల కేక్‌లు కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. బుధవారం గన్నవరం సమీపంలోని ఐటీ పార్కులో జరిగిన ముఖ్యమంత్రి, మంత్రులు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రజలు పెద్ద ఎత్తున తిలకించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఇళ్లలో టీవీలకు అతుక్కుపోయారు. ప్రభుత్వ పరంగా కూడా అధికారులు జిల్లావ్యాప్తంగా 12 చోట్ల భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి ప్రమాణస్వీకార కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని చూపించారు. నెల్లూరులో కోటమిట్ట షాదీ మంజిల్, స్టోన్‌హౌస్‌పేట బీవీఎస్ హైస్కూల్, గాంధీబొమ్మ వద్దనున్న స్వతంత్ర పార్కు, కస్తూర్బా కళాక్షేత్రం, అనీల్ గార్డెన్స్‌లలో ఈ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ సేదుమాదవన్, కమిషనర్ వికాస్ మర్మత్, డీఆర్వో లవన్నలతోపాటు జిల్లా అధికారులు తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని వీక్షించారు. నెల్లూరులోని నర్తకి సెంటర్‌లో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు, నగరాధ్యక్షుడు మామిడాల మధుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంబరాలు జరిగాయి. ఎన్టీఆర్ విగ్రహాన్ని శుద్ధి చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. నారావారి సెంటర్లో భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు అభినందనలు తెలియజేసుకున్నారు.



చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని వీక్షిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

● కందుకూరులోని వెంగమాంబ కల్యాణ మండపం, కావలిలోని బృందావనం కల్యాణమండపం, ఆత్మకూరు రవితేజ కల్యాణ మండపం, బుచ్చిలోని ఎంఎం ఫంక్షన్ హాలు, వెంకటాచలంలోని శ్రీష్ కల్యాణ మండపం, ఉదయగిరిలోని టీటీడీ కల్యాణ మండపాల్లో సీఎం ప్రమాణ స్వీకారాన్ని ప్రజలు, అధికారులు వీక్షించారు.



ఉదయగిరి రూరల్ : శివాలయంలో పూజలు



సంగంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు



కలిగిరిలో టీడీపీ శ్రేణుల ఆనందం



కలువాయిలో ఎన్డీఏ నాయకులు..

మొగిలిచెర్లలో ఉద్రిక్తత!

టీడీపీ, వైసీపీ వర్గాల ఘర్షణ ● రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు ● పోలీసుల లాఠీచార్జి.. డీఎస్పీ పర్యవేక్షణ



మొగలిచెర్లలో ఘర్షణకు దిగిన టీడీపీ, వైసీపీ వర్గాలు

లింగసముద్రం, జూన్ 12 : మొగిలిచెర్ల గ్రామంలో బుధవారం టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ నెలకొంది. పరిస్థితి అదుపుతప్పేలా ఉండటంతో పోలీసులు లాఠీచార్జి చేసి, చెదరగొట్టారు. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సంబరాలు చేసుకుంటూ బాణాసంచా కాలుస్తూ వేడుకలు నిర్వహించారు. అయితే వైసీపీ నాయకుడు కొలికి కొండలరావు తన అనుచరులతో కలిసి తన ఇంటివద్ద బాణాసంచా కాల్చవద్దని అనడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో ఇరువర్గాలు రాళ్లతో దాడి చేసుకున్నాయి. విషయం తెలుసుకున్న లింగసముద్రం, వలేటివారిపాళెం ఎస్ఐలు బాజీబాబు, మహేంద్ర నాయక్ అక్కడకు చేరుకుని స్పెషల్ పోలీసులు, పోలీసులు ఇరువర్గాలపై లాఠీచార్జీ చేసి చెదరగొట్టారు. దీంతో టీడీపీ, వైసీపీలకు చెందిన కొందరికి, ఒకరిద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. కందుకూరు డీఎస్పీ ఎ శ్రీనివాస్ గ్రామానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. అనంతరం గుడ్లూరు సీఐ బీవీ సుబ్బారావు, గుడ్లూరు ఎస్సై లక్ష్మణరావు, కందుకూరు రూరల్ ఎస్సై రమణయ్యలు, స్పెషల్ పోలీసులు కూడా గ్రామానికి చేరుకొని శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

టీడీపీ వర్గీయులపై వైసీపీ మూకల దాడి

నలుగురికి గాయాలు

శంకరనగరంలో ఉద్రిక్తత



వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడ్డ టీడీపీ నాయకులు

అనంతసాగరం, జూన్ 12: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా టీడీపీ వర్గీయులు విజయోత్సవ ర్యాలీ చేసుకుంటుండగా, వైసీపీ మూకలు దాడి చేసిన ఘటన బుధవారం రాత్రి మండలంలోని శంకరనగరంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు... నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, ఆనం రామనారాయణరెడ్డి మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నాయి. ఈ క్రమంలో టీడీపీ వర్గీయులు డీజేతో గ్రామంలో విజయోత్సవ ర్యాలీ చేస్తుండగా వైసీపీ నాయకులు మాటు వేసి గొడ్డళ్లు, కర్రలు, రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో టీడీపీకి చెందిన ఎస్ కార్తిక్ చౌదరి, శ్రీరామ్‌నాయుడు, ఎస్ శ్రీహరినాయుడు, డీ మహేష్, ఎస్ సుబ్బారాయుడుకు తీవ్రగాయాలు కాగా మరో ముగ్గురికి స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని నెల్లూరుకు తరలించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో ఒక్కసారిగా ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఆత్మకూరు సీఐ వేణు, అనంతసాగరం ఎస్ఐ సూర్యప్రకాశ్‌రెడ్డి పరిస్థితిని సమీక్షించి గ్రామంలో ప్రత్యేక బలగాలతో పహారా ఏర్పాటు చేశారు. అలాగే, రేవూరులో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఓ ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు విచారిస్తున్నారు.


సభా వేదిక వద్ద కోలాహలం



వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం






చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన


వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి


జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

వివాదాస్పద కలప తరలింపునకు యత్నం

ఉదయగిరి, జూన్ 12: మండలంలోని కొండాయ పాళెం పంచాయతీలో ప్రభుత్వ భూముల్లో ఉన్న జామాయిల్ కర్రను నరికి తరలించేందుకు కొందరు మంగళవారం రాత్రి యత్నించారు. ఈ విషయంపై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో వెంకట్ అక్కడికెళ్లి అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిలో ఉన్న జామాయిల్ కర్రను అక్రమంగా నరికి తరలించేందుకు ప్రయత్నిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంపై వీఆర్వోను సంప్రదించగా ప్రభుత్వ భూముల్లో జామాయిల్ కర్రను అక్రమంగా తరలించే వ్యక్తులపై నిఘా ఉంచామని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామన్నారు.


కలప తరలింపును అడ్డుకుంటున్న వీఆర్వో

లక్ష్యాలను అధిగమించండి

- జిల్లా రిజిస్ట్రారు బాలాంజనేయులు

అల్లూరు, జూన్ 12 : సబ్ రిజిస్ట్రార్లు తమకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించేందుకు కృషి చేయాలని స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రారు బాలాంజనేయులు సూచించారు. బుధవారం ఆయన వార్షిక తనిఖీ ల్లో భాగంగా అల్లూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాన్ని తనఖీ చేశారు. రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది అల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి రూ.7.68 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించగా రూ.5.61 కోట్లతో 71 శాతం సాధించారన్నారు. ఇచ్చిన లక్ష్యాన్ని సాధించలేక పోవడానికి గల కారణాలపై పరిశీలించారు. కొత్త ప్రభుత్వంలో జరిగే అభివృద్ధిని బట్టి ప్రాంతాలను బట్టి మార్కెట్ విలువను పెంచి నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేలా సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రారు ప్రసన్నలక్ష్మి, సిబ్బంది వంశీకృష్ణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రారు బాలాంజనేయులు

రెండు రైళ్లలో చోరీ?

- వాట్సాప్ గ్రూపుల్లో పుకార్లు
- ఫిర్యాదు అందలేదంటున్నరైల్వే పోలీసులు

బిట్రగుంట, జూన్ 12 : బిట్రగుంట రైల్వే సెక్షన్ పరిధిలోని కావలి-వేంకటేశ్వరపాలెం రైల్వే స్టేషన్ల మధ్య రెండు రైళ్లలో చోరీలు జరిగాయని కొన్ని వాట్సాప్ గ్రూపులో పుకారులు చికార్లు చేశాయి. అయితే తెల్లవారుజామున చెన్నై వైపు వెళ్లే రైళ్ల రెండు మాత్రం వేంకటేశ్వరపాలెం రైల్వే స్టేషన్ సమీపంలో ఆగినట్లు స్థానికులు అంటున్నారు. ఈ విషయమై కావలి జీఆర్పీ ఎస్సై బందోబస్తుకు వెళ్లారని తెలియడంతో సీఐని వివరాలు కోరగా తమకు రాత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	154
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	300
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6813
వెండి కిలో ధర	రూ. 90,800
వెండి ఒక గ్రాము	రూ. 92.80

అనారోగ్యంతో చేనేత కార్మికుడి మృతి

సంగం, జూన్ 12: స్థానిక సాయి నగర్ కాలనీకు చెందిన నారే ఆనంద్ (55) అనే చేనేత కార్మికుడు అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. వివరాల మేరకు నారే ఆనంద్‌కు భార్య పుష్ప, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆనంద్ చేనేత పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పిల్లల చదువు నిమిత్తం ఉన్న ఇంటిని అమ్ముకుని కోవూరు మండలం పాటూరుకు వలస వెళ్లి బాడుగ ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆనంద్ పక్షవాతానికి గురయ్యాడు. వైద్యం కూడా చేయించుకోలేని పరిస్థితి. దీంతో బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఆనంద్ మృతితో ఇద్దరు కుమార్తెలు, భార్య పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

బడికి వేళాయె!

- నేడు స్కూళ్ల పునఃప్రారంభం
- 52 రోజుల తర్వాత తెరుచుకోనున్న తలుపులు
- విద్యార్థులకు స్వాగతం పలకనున్న సమస్యలు

నెల్లూరు (విద్య), జూన్ 12 : వేసవి సెలవుల తర్వాత గురువారం పాఠశాలల తలుపులు తెరుచుకోనున్నాయి. జిల్లాలో ప్రభుత్వ మేనేజ్‌మెంట్ 2,595 పాఠశాలలు, ఎయిడెడ్ 22, ప్రైవేట్ 815 మొత్తం 3,432 పాఠశాలలు ఉండగా, 3,54,779 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ సంఖ్య కొత్త విద్యాసంవత్సరంలో మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు కల్పించి కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దుతామని గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు విమర్శలకు తావిస్తోంది. పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో సమస్యలు మాత్రం అలాగే కొలువై ఉన్నాయి. ప్రధానంగా కొన్ని స్కూళ్లలో పిల్లలకు తాగేందుకు మంచినీరు కూడా ఉండటం లేదు. రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌లు దిష్టిబొమ్మల్లా మిగిలిపోతున్నాయి. కాగా, ఉన్నత పాఠశాలకు కిలోమీటరు పరిధిలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులను విలీనం చేశారు. ఇప్పటివరకు 6 నుంచి 10 తరగతులతో నడిచేవి. ఇకపై ఇవన్నీ 3 నుంచి 10 తరగతులకు మారాయి. 90శాతం పాఠశాలల్లో తగినన్ని వసతులు లేకపోగా నాడు-నేడు కింద పాఠశాలల్లో వసతులు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పినా అత్యధిక పాఠశాలల్లో నేటివరకు పునాదులే పడకపోవడం విశేషం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు, మరుగుదొడ్లు, ప్రహరీ, వంటశాలలు, తాగునీరు, విద్యుత్, బెంచీలు, గ్రీన్‌బోర్డుల ఏర్పాటు తదితర వసతులు కల్పించాలని ఆదేశించినా నేటికీ ఈ పనులు నత్తనడకన సాగుతూనే ఉన్నాయి. దీనికితోడు ఇప్పటికే పూర్తయిన ప్రాథమిక పాఠశాలలను పూర్తిస్థాయిలో వినియోగించుకోకుండానే 3, 4, 5 తరగతులను తరలిస్తుండటంతో ఈ పాఠశాలలన్నీ వెలవెలబోతున్నాయి. కోట్లాది రూపాయలు వెచ్చించి సిద్ధం చేసిన పాఠశాలలు ఉపయోగపడకపోగా, విద్యార్థులు తరలివెళ్లే పాఠశాలల్లో మాత్రం పనులు సాగుతూ...నే ఉన్నాయి.

అటెండెన్స్ యాప్ ఉపయోగించాలి

పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న దృష్ట్యా డిప్యూటీ ఈఓలు, ఎంఈఓలు స్కూల్ అటెండెన్స్ యాప్‌ను ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలి. యాప్‌నకు సంబంధించి పాఠశాల, కార్యాలయ సిబ్బంది, తమ లాగిన్, పాస్‌వర్డ్‌లను చెక్ చేసుకుని సిబ్బంది, విద్యార్థుల హాజరును యాప్‌లో సకాలంలో నమోదు చేయాలి. అలాగే పాఠశాల లాగిన్‌లో సర్వీసెస్, స్టాఫ్, ఎంప్లాయి స్టేటస్‌లో సిబ్బంది రిటైర్డ్, డెత్ వివరాలను అప్‌డేట్ చేయాలి.

- రామారావు, డీఈఓ


విద్యాశాఖ అధికారులకు పుస్తకాలు అందిస్తున్న డీఈఓ రామారావు


ఉదయగిరి రూరల్ : బందెలదొడ్డిలా ఉన్న వెంకట్రావుపల్లి పాఠశాల

- **అరకొర నిధులతోనే నిర్వహణ**

పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం విడుదల చేసే నిధులతోనే విద్యుత్, ఇంటర్నెట్ బిల్లుల చెల్లింపు, ఫ్యాన్లు, మరుగుదొడ్లలో కొళాయిలు, పైపుల మరమ్మ తులు, కంప్యూటర్ల రిపేర్లు, స్టేషనరీ కోసం ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే, గతేడాది కేటాయించిన బడ్జెట్‌లో కేవలం 20శాతం మాత్రమే నిధులు విడుదల చేయడంతో నిర్వహణ గ్రాంట్ సరిపోక ఎక్కడ రిపేర్లు అక్కడే ఆగిపోయాయి. గత ఏడాది నిర్వహణ గ్రాంట్ లక్ష రూపాయలు దాటిన పాఠశాలలకు ప్రభుత్వం ఇప్పటి వరకు బిల్లులు విడుదల చేయలేదు. ఈ ఏడాది మార్చి నెలలో బిల్లులు పెడి తే వీటిని సీఎంఎఫ్ఎస్‌లో తిరస్కరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బిల్లులను ఖచ్చితంగా విడు దల చేస్తామని చెప్పిన అధికారులు దాన్ని పట్టించుకోకపోవడంతో చేతిడబ్బులు ఖర్చు చేసిన హెచ్‌ఎంలు ఏంచేయాలో దిక్కుతోచక ఆవేదన చెందుతున్నారు.

- **పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు**

పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్న నేపథ్యంలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్టూడెంట్ కిట్స్ అన్ని పాఠశాలలకు చేరవేస్తున్నట్లు అధికారులు తెలిపారు. నెల్లూరులోని వెంగళరావునగర్‌లోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే.రామారావు చేతుల మీదుగా నెల్లూరు మండలంలోని అన్ని పాఠశాలలకు స్టూడెంట్స్ కిట్స్, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలలకు హాజరైన విద్యార్థులందరికీ తొలిరోజే పుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలు

- జిల్లా అధికారి వెంకటయ్య

నెల్లూరు(హరనాథపురం), జూన్ 12 : బీసీ బాలికల వసతి గృహాల్లో సీసీ కెమెరాలను అమర్చి గట్టి భద్రతా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా బీసీ సంక్షేమ సాధికారిత అధికారి వై వెంకటయ్య తెలిపారు. బుధవారం జూమ్ సమావేశం ద్వారా ఆయన హాస్టల్ సంక్షే మాధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. బీసీ బాలికల వసతి గృహాల్లో బాత్‌రూములు, ఇతర అన్ని వసతులు తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. స్వంత భవనాలు లేని వసతి గృహాల్లో మరమ్మతు పనులను ఆ ఇంటి యజమానులతో చేయించాలన్నారు. ప్రభుత్వ భవనాలైతే దాతల సహకారం తీసుకోవాలని సూచించారు. హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంపునకు గట్టి చర్యలు చేపట్టాలన్నారు. మెనూ కచ్చితంగా పాటించాలని, దీనిపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సోమశిలకు 4,072 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, జూన్ 12: సోమశిల జలాశయంకు ఎగువ నుంచి బుధవారం 4,072 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 8.341 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగు వ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు కొనసాగుతుంది.

తపాలా శాఖతో

శుభాకాంక్షలు తెలిపే సౌకర్యం

ఉదయగిరి రూరల్, జూన్ 12: ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, లోక్‌సభ, శాసనసభ సభ్యులకు కేవలం రూ.12ల ఖర్చుతో తపాలా శాఖా ఈ-పోస్ట్ ద్వారా శుభాకాంక్షలు తెలిపే అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నెల్లూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక సబ్ పోస్టాఫీసు కార్యాలయ ఆవరణలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సాయికృష్ణారెడ్డి, ఎస్‌పీఎంలు బుర్రి చినతిరుపాలయ్య, రఫీ, నజీర్‌బాషా, నరసయ్య, రాజేష్, గౌరబ్, మెయిల్‌ఓవర్సీర్లు రామకృష్ణారెడ్డి, మోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

వాడవాడలా టీడీపీ సంబరాలు

● ఎల్ఈడీ స్క్రీన్ల ద్వారా చంద్రబాబు ప్రమాణ స్వీకారం వీక్షణ ● బాణాసంచా కాల్చి, కేకులు కట్ చేసి పంపిణీ



అల్లూరు : చంద్రబాబు ప్రమాణ స్వీకారం తిలకిస్తున్న బీద గిరిధర్, తదితరులు



కందుకూరు : కేకు కట్ చేస్తున్న నాయకులు



ఆత్మకూరు : బాణాసంచా కాల్చుతున్న శ్రేణులు

కావలి, జూన్ 12: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 4వ సారి, మంత్రులుగా పవన్‌కళ్యాన్, లోకేష్ తదితరులు బుధవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేయడంతో వాడవాడలా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. ప్రమాణ స్వీకారోత్సవం ప్రారంభం నుంచి ముగింపు వరకు కావలి పట్టణంలోని పలు ప్రాంతాల్లో బాణసంచా మోత వినిపిస్తూనే ఉంది. బృందావనం హౌసింగ్ కాలనీ కల్యాణ మండపంలో కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు, నేతలు వీక్షించారు. అలాగే పాతూరులో స్థానిక పాతూరు నాయకులే సొంత ఖర్చులతో ఎల్ఈడీ స్క్రీన్‌లతో ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు తిలకించే విధంగా ఏర్పాటు చేశారు. అక్కడే కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ట్రంకు రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలుగోళ్లమ్మపేటలోని మానస హాల్ సెంటర్‌లో అభిమానులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. జనసేన ఆధ్వర్యంలో జనసైనికులు జనసేన, టీడీపీ జెండాలతో పట్టణంలో మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే పట్టణంలోని ఒంగోలు బస్టాండ్‌లోని పాదర్తి దుకాణం దగ్గర వామ్ కావలి మహిళా విభాగం ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద కావలి వాసవి, సెవెన్‌లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్నాటి సుబ్బారావు, అనుమలిశెట్టి వాసు, గాదంశెట్టి వేణు, పాదర్తి నాగరాజు, తిరువీధి ప్రసాద్, ఏల్చూరి రవి, పెట్లుగాని రమేష్, ఓరుగంటి రామకృష్ణ, గుర్రం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : రాష్ట్రంలో చంద్రబాబునాయుడు సారథ్యంలోని నూతన ప్రభుత్వం కొలువుదీరిన వేళ కందుకూరు ప్రాంతంలో వాడవాడలా సంబరాలు మిన్నంటాయి. ప్రజలంతా టీవీలలో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌ల వద్ద చంద్రబాబునాయుడు, మంత్రివర్గం ప్రమాణస్వీకార మహోత్సవాన్ని వీక్షించారు. ఎక్కడికక్కడ పెద్దఎత్తున బాణసంచా కాల్చుతూ స్వీట్లు పంచిపెట్టారు. పలు గ్రామాల్లో, పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రమాణస్వీకార మహోత్సవం జరుగుతున్నంతసేపు బాణసంచా కాలుస్తూ యువకులు తమ ఆనందాన్ని పంచుకున్నారు. పట్టణంలోని వెంగమాంబ ఫంక్షన్‌హాలులో ప్రజలు వీక్షించేందుకు వీలుగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ప్రమాణస్వీకారోత్సవం అనంతరం ఫంక్షన్‌హాలు వెలుపల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. పట్టణంలోని 21వ వార్డులో స్థానిక టీడీపీ నాయకులు పతకమూరి వరప్రసాదరావు, చెరువుగట్టు బ్రహ్మయ్య, పి.అనీల్‌ల ఆధ్వర్యంలో టీడీపీ బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చిలకపాటి మధుబాబు కేకు కట్‌చేసి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

అల్లూరు : తెలుగుదేశం, జనసేన. బీజేపీల ప్రతి కార్యకర్త కష్ట ఫలమే ఎన్డీఏ విజయానికి కారణమయ్యాయని నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారాన్ని తిలకించేందుకు స్థానిక వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఎల్ఈడీ ఏర్పాటు చేశారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి తిలకించారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్‌చేసి కేకు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బుల్లా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, అరగల రమణయ్య, హరూన్ రషీద్, రాయి నాయుడు, రేబాల శంకర్‌రెడ్డి, తిరువీధి అనురాధ, ఊటు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, జి బాలనారాయణ, నీలం బ్రహ్మారెడ్డి, పార్టీ కార్యకర్తలు, నాయకులు బాణాసంచా కాల్చి తమ ఆనందోత్సాహాలను వ్యక్తం చేశారు. కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షుడు అడపా నర్సయ్య, మక్కెన మల్లికార్జున, పరేష్ తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి : ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని పురస్కరించుకొని పట్టణంలోని కలిగిరమ్మ కూడలి ప్రాంతంలో బాణసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఊసా మాల్యాద్రి, ఎన్ ప్రభాకరరావు, కాకు మహేష్, స్వర్ణ కొండయ్య, లెక్కల రాంబాబు, నిశ్శంకర సురేష్, జిర్రా చినఅంకిరెడ్డి, పెదఅంకిరెడ్డి, కాకు మహేష్, ఓబయ్య, కె.వెంకట్రావు, బీ.మల్లికార్జున, రవీంద్ర, భాస్కరాచారి, రామయ్య, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురం : చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం సందర్భంగా మండలంలోని సాయిపేట పంచాయతీ ఎస్సీకాలనీలో, వెల్లటూరివారిపాలెంలో కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టి బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. గుడవళ్లూరు, తూర్పుపాలెం, తూర్పుఎర్రబల్లి తదితర అన్ని గ్రామాలల్లోనూ కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

బిట్రగుంట : ముఖ్యంత్రిగా చంద్రబాబు, పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం సందర్భంగా బోగోలు మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బోగోలు కూడలిలోని బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. బజారు కూడల్లో బాణాసంచా కాల్చారు. రైల్వే ఎల్సీగేట్ 144 పడమర గిరిజన నాయకుడు బోగిరి ప్రభాకర్, యోహానులు తమ సొంత నిధులతో ప్రమాణ స్వీకారాని వీక్షించేందుకు భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు, బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, మాజీ సర్పంచు దొడ్ల అంజయ్య, మాజీ ఎంపీపీ పాశం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ముంగమూరులో యన్నాబత్తిన వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వాని చల్లంగా చూడమని పోలేరమ్మకు ప్రత్యేక పూజలు, గ్రామంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



కావలి : పాతూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ...



కొండాపురం : వెల్లటూరివారిపాలెంలో....



బిట్రగుంట : ప్రమాణ స్వీకారం వీక్షిస్తున్న శ్రేణులు

వలేటివారిపాలెం : చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా మండలంలోని బడేవారిపాలెంలో టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పూలు, రంగులు చల్లుకుంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. యువత డ్యాన్స్‌లు చేస్తూ కేరింతలు కొట్టారు. అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య తమ మహిళా కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. జై తెలుగుదేశం జై చంద్రబాబు, జై నాగేశ్వరరావు అంటూ నినాదాలతో హోరెత్తించారు.

ఆత్మకూరు : నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించడంతో పాటు ముఖ్యమంత్రిగా చంద్రబాబు మంత్రి వర్గంలో రాష్ట్ర మంత్రి పదవి వరించడంతో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు బుధవారం సంబరాల్లో మునిగితేలారు. పలు ప్రాంతాల్లో కేక్ కట్ చేసి బాణాసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. పట్టణంలోని ఆర్యవైశ్య ప్రధాన వీధిలో టీడీపీ శ్రేణులు బాణాసంచా పేల్చారు. తోట సుబ్బారావు ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి పెట్టారు. జేఆర్‌పేటలోని 4వ వార్డులో, 20వ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

సంగం : మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు బుధవారం ఘనంగా సంబరాలు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం కొలువు దీరి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎంగా, ఆనం రామనారాయణరెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఈ సంబరాలు చేసుకున్నారు. అందులో భాగంగా టీడీపీ సీనియర్ నాయకులు కోటు వెంకట కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అలాగే తలుపూరుపాడులో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి షేక్ బాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంగం బస్టాండ్‌లో కర్నాటి చరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి బాణాసంచి కాల్చి సంబరాలు చేసుకున్నారు. కలువాయిలో టీడీపీ శ్రేణులు సంబరాలు.

కలువాయి: రాష్ట్ర ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం సందర్భంగా కలువాయిలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు చల్లా రఘురామిరెడ్డి, చల్లా బుజ్జిరెడ్డి, గడ్డం కిషోర్ రెడ్డి, దండు పెంచలయ్య, ఎన్.నరసింహులు యాదవ్, పిడుగు శ్రీనివాసులురెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతసాగరం : నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో సాగరంలో టీడీపీ శ్రేణులు సంబరాల్లో మునిగితేలారు. బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. టీడీపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో చల్లా శివారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కే తిరుపతినాయుడు, బి జగన్మోహన్‌రెడ్డి, మనోహర్, పద్మనాభ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, సీనియర్ నాయకులు ఎస్కే బాబు, పిడుగు జయరాములు, దేవర వెంకటేశ్వరు, 8 బూత్ ఇంచార్జి తోట మాల్యాద్రి, 7 వార్డు మెంబర్ తోట మనోజ్ బాబు, బోగినేని కాశిరత్తయ్య, తోట నవీన్ కుమార్, తోట ఏడుకొండలు, తోట లక్ష్మయ్య, గురుమూర్తి, పవన్, కొత్త జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయడంతో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశానుసారం టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చేపట్టిన సంబరాలు అంబరాన్నంటాయి. అలాగే పంచాయతీ బస్టాండ్ సెంటర్ నుంచి మెయిన్ బజార్‌లోని శివాలయం వరకు నినాదాలతో కూడిన ర్యాలీ చేపట్టారు. అనంతరం శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి 101 టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, నరసింహా, సందానీ, సజిల్, మాబాషా, ఖాన్‌షా, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వలేటివారిపాలెం : కేక్ కట్ చేస్తున్న సౌజన్య



కావలి : మజ్జిగ, స్వీట్లు పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్యులు



అనంతసాగరం : కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు



సీతారామాపురం : బాణాసంచా కాలుస్తున్న తెలుగు యువత నాయకులు

రాష్ట్ర మంత్రి ఆనంకు అభినందన వెల్లువ





రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అభినందనలు తెలుపుతున్న ఆత్మకూరు టీడీపీ నేతలు

ఆత్మకూరు, జూన్ 12 : రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆనం రామనారాయణరెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. రాష్ట్ర మంత్రివర్గ ప్రమాణస్వీకారానికి నియోజకవర్గం నుంచి టీడీపీ కూటమి నేతలు గన్నవరం విమానాశ్రయంలోని కేసరపల్లికి తరలివెళ్లారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆనంను పలువురు నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ అధ్యక్ష కార్యదర్శులు సుంకర పెంచలచౌదరి, కేతా విజయభస్కర్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు తలచీరు బాబునాయుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొల్లి నరసపు నాయుడు ఆనం రామనారాయణరెడ్డిని సన్మానించారు.

సంగం : నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి వర్గంలో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి స్థానిక టీడీపీ నాయకులు అమరావతికి వెళ్లి బుధవారం పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆనం ప్రసాద్‌రెడ్డి, కర్నాటి రవీంద్రరెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, పగడాల రఘురామయ్య, మండల పార్టీ కన్వీనర్ జి శ్రీనివాసులు యాదవ్, మహిళా నాయకురాలు కే. మంజులనాయుడు, వేణుబాలు తదితర నాయకులు ఉన్నారు.

సోషల్ రిఫార్మర్ల ఆత్మీయ కలయిక

కావలిటౌన్, జూన్ 12: స్వచ్ఛంద సేవాసంస్థల నిర్వాహకులు ఒకే వేదికగా ఏర్పాటు చేసుకున్న సోషల్ రిఫార్మర్స్ సభ్యుల ఆత్మీయ కలయిక బుధవారం రెడ్‌క్రాస్ సమావేశ మందిరంలో జరిగింది. స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే కార్యక్రమాలపై సమీక్షించారు. ఆయా సంస్థలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చేపట్టవలసిన చర్యలు, భవిష్యత్‌లో నిర్వహించనున్న కార్యక్రమాలపై ప్రణాళిక రూపొందించారు. ఈ సమావేశంలో డాక్టర్ చేవూరు చిన్న, రాయపాటి దిలీప్, షేక్ రఫీ, మొగల్ సలీం బేగ్, మారుతిరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఉలవపాడు, జూన్ 12 : వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దారు చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి ఆధ్వర్యంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రతి అధికారి పాల్గొనే ఈ వేదికపై సమస్యలను అర్జీల రూపంలో స్వీకరిస్తారని పేర్కొన్నారు. వేదిక సమీపంలోనే ఆధార్ సేవా కేంద్రం, లీగల్ సెల్ ఏర్పాటు చేయున్నట్లు తెలిపారు. నూతన ఆధార్, సవరణలతోపాటు లీగల్ సెల్ నందు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, నలుగురు న్యాయవాదులు పాల్గొంటారని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్జీల స్వీకరణ రేపటికి వాయిదా

వలేటివారిపాలెం, జూన్ 12 : వలేటివారిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగవలసిన అర్జీల స్వీకరణ కార్యక్రమం అనివార్యక కారణాల వలన శుక్రవారానికి వాయిదా వేసినట్లు తహసీల్దారు నాగమల్లేశ్వరావు, ఎంపీడీవో రఫీక్‌అహ్మద్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

లేగదూడులకు వ్యాధి నివారణకు వ్యాక్సిన్

కొండాపురం, జూన్ 12: తొలకరి చినుకులు సమయంలో పచ్చిక పట్టడం వలన లేగదూడలకు వ్యాధులు సంక్రమించకుండా పశువైద్యశాఖ సిబ్బంది బుధవారం పచ్చిక దొమ్మ వ్యాక్సిన్ వేశారు. సాయిపేట పశువైద్యాధికారి మధు ఆదేశాల మేరకు పార్లపల్లి పశువైద్య సహాయకుడు శీలం శ్రీనివాసులు, సాయిపేట పశువైద్య సహాయకురాలు బొడ్డు ఖ్యాతిలు భీమవరప్పాడు గ్రామంలోని 4 నెలల నుంచి 3 ఏళ్ల వయస్సుగల 102 లేగదూడలకు వ్యాక్సిన్ వేశారు.

వైభవంగా పోలేరమ్మ గ్రామోత్సవం



బిట్రగుంట, జూన్ 12: బోగోలు మండలం కోవూరుపల్లి పంచాయతీ గిరిజన కాలనీలో వెలసి ఉన్న పోలేరమ్మ గ్రామ పొంగళ్ల కార్యక్రమంలో భాగంగా రెండో రోజు బుధవారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. పోలేరమ్మ అశ్వవాహనంపై గజమాలతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో రామోహన్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, నాటకరాణి భాస్కర్, రంగయ్య, తిరుపతి, శీనయ్యలు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్నారై కోఆర్డినేటర్‌కు చంద్రబాబు ప్రశంసలు

కావలిటౌన్, జూన్ 12: టార్గెట్ 2024లో భాగంగా అమెరికాలోని సెయింట్ లూయిస్ సిటీ ఎన్నారై టీడీపీ కోఆర్డినేటర్ మన్నవ తేజ్‌బాబును అమెరికాలోని మిస్సోరి స్టేట్ సెయింట్ లూయిస్ సిటీలో టీడీపీ ఎన్నారై సెల్ ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు పంపిన ప్రశంసాపత్రంతో మంగళవారం రాత్రి ఘనంగా సత్కరించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర కుమారుడైన తేజ్ బాబు మాట్లాడుతూ టార్గెట్ 2024ను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ముందుకెళ్లామన్నారు. టీడీపీ ఎన్నారై యాప్ ద్వారా సమర్థవంతంగా విధులు నిర్వహించి టీడీపీ గెలుపునకు కృషి చేశామన్నారు. తన సేవలను గుర్తించిన చంద్రబాబు నాయుడు చరవాణి ద్వారా అభినందించడంతోపాటు ప్రశంసాపత్రాన్ని పంపించడం సంతోషంగా ఉందన్నారు.



చంద్రబాబు పంపిన ప్రశంసాపత్రంతో తేజ్‌బాబు

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

అల్లూరు, జూన్ 12 : అల్లూరు కోసేరు సెంటరులో వెలసి ఉన్న అభయాంజనేయస్వామి పుష్కరిణి క్షేత్రం సప్త వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. క్షేత్రం నుంచి అల్లూరు ప్రధాన రహదారిలో యువకులు ద్విచక్ర వాహనాలపై కాషాయ రంగు జెండాలను అలంకరింపజేసి కాషాయ దుస్తులతో జై శ్రీరామ్.. జై హనుమాన్.. నినాదాలతో యాత్ర కొనసాగించారు. అల్లూరులో మొట్టమొదటిగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఏటా కొనసాగిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కావలి రూరల్ సీఐ నాగభూషణం, అల్లూరు ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దమ్మాల వెంకట బ్రహ్మానందరావు, పిట్టల కమలాకర్, కారుమంచి కార్తీక్ శర్మ, నారాయణ స్వామి, పొన్నపూడి శ్రీనివాసులు, శివ, కళ్యాణ్, పోలయ్య, మునిరాజా, శ్రీకాంత్ పాల్గొన్నారు.



అల్లూరులో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

మీ పిల్లలను జడ్పీ హైస్కూల్‌లో చేర్పించండి



జడ్పీ హైస్కూల్‌లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్న హెచ్‌ఎం

లింగసముద్రం, జూన్ 12 : అన్ని వసతులున్న లింగసముద్రంలోని కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో తమ పిల్లలను చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి మాధవరావు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. బుధవారం లింగసముద్రంలో హెచ్‌ఎం మాధవరావు, ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి హైస్కూల్‌లో విద్యార్థులకు లభించే సౌకర్యాలు గురించి వివరించారు. హైస్కూల్‌లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు, ఐఎఫ్‌పీ ప్యానెల్, ట్యాబులు, విశాలమైన ఆటస్థలం వంటి వసతులు ఉన్నాయన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాం ఇస్తారని, పాఠశాలకు అనుబంధంగా మూడు వసతి గృహాలు ఉన్నాయని చెప్పారు. ల్యాబ్ సౌకర్యం, ఎన్ఎంఎంఎస్‌కు ప్రత్యేక శిక్షణ, స్టడీ అవర్స్ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం కొండయ్య, ఎ నారాయణ, కె ప్రభాకర్, కె వెంకటేశ్వర్లు, టివివి కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 12: స్థానిక ఆదర్శ పాఠశాలలో 7, 8, 9వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సైమన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 15వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు దరఖాస్తులను పాఠశాలలో అందజేయాలని, ప్రవేశ పరీక్ష ద్వారా సీట్లను భర్తీ చేస్తామన్నారు. ప్రవేశ పరీక్ష ఈనెల 20న ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం

ఉదయగిరి రూరల్, జూన్ 12: మండలంలోని నేలటూరి పంచాయతీ సర్వరాబాదు తెలుగు చర్చి పదో వార్షికోత్సవం సంఘకాపరి డాక్టర్ కొంగలేటి జయరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం బైబిల్ సందేశాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో పాస్టర్ లాజర్‌ఏసుదాసు, సంఘపెద్ద గొల్లపల్లి సాల్మన్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల తనిఖీ

ఉదయగిరి, జూన్ 12: పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలను బుధవారం ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అధికారులు తనిఖీ చేపట్టారు. హోలీఏంజల్స్, సెంట్‌మేరీ, సాధన పాఠశాలల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలకేశవులు, కృష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరామిరెడ్డి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే పాఠశాలలను నిర్వహించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉదయగిరి, జూన్ 12: మండలంలోని వెంకట్రావుపల్లిలో మంగళవారం అర్ధరాత్రి పెద్ద ప్రమాదం తప్పింది. గాలి వానకి దుగ్గినబోయిన నాగేశ్వరరావు ఇంటి ఎదురుగా మెయిన్‌లైన్ విద్యుత్ తీగ ఉన్నట్లుండి తెగిపడింది. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ తీగ తెగిపడడంతో గ్రామంలో అంధకారం నెలకొంది. ఎన్నిసార్లు లైన్‌మెన్‌కు ఫోన్ చేసినా స్పందించలేదని గ్రామస్తులు తెలిపారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఉదయగిరి రూరల్, జూన్ 12: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసినందుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు గాజుల బాబు, మున్నా పేదలకు చీరలు పంపిణీ చేశారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల ఆధ్వర్యంలో అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఆశిస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు గూడూరు వెంకటేశ్వరరావు, మట్ల లక్ష్మయ్య, అర్షద్, శ్రావణ్, రవి, రమణయ్య, ప్రసాద్, మహేష్, సమీ, జిలానీ, అస్లామ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

ఉదయగిరి, జూన్ 12: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు బుధవారం ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. మండలంలోని 1 నుంచి 5వ తరగతులకు 9,610, అలాగే 7, 8, 9వ తరగతులకు 13,064 పుస్తకాలను అందజేశామన్నారు. విద్యార్థులకు బ్యాగులు, బెల్ట్‌లు, సాక్సులు రావాల్సి ఉందని ఆయన తెలిపారు.

స్టూడెంట్ కిట్ల సరఫరా

వరికుంటపాడు : విద్యా సంవత్సరానికి ముందుగానే నూతన ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన స్టూడెంట్ కిట్లను మండలానికి సరఫరా చేసింది. అందులో భాగంగా యూనిఫాం, నోట్ పుస్తకాలను అందజేసింది. తొలి విడతగా 8,10 తరగతులకు ఫిజిక్స్ పుస్తకాలు మినహా మిగిలిన 13,340 పుస్తకాలను స్టాక్ పాయింట్‌కు తరలించారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

సైదాపురంలో సందడి

సైదాపురం,జూన్12: చంద్రబాబు నాయుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడంతో మండలంలోని గ్రామాల్లో బుధవారం టీడీపీ శేణులు సంబరాలు జరుపుకున్నాయి. సైదాపురం, జోగిపల్లి, తురిమెర్ల, గ్రిద్దలూరు, తుమ్మలతలుపూరు, కలిచేడు, చాగణం, మర్లపూడి, ఊటుకూరు, చీకవోలు గ్రామాల్లో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వరిగొండ సురేంద్ర, అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, కందాటి విజయ్ రాఘవరెడ్డి, కందాటి దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారంతో వేడుకలు
- మంత్రులుగా రామనారాయణరెడ్డి, నారాయణ ప్రమాణంతో కేరింతలు
- బాణాసంచా మోత, కేకులతో కూటమి శ్రేణుల హర్షం

పదవీ స్వీకార సంబరం

తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో ఆయా పార్టీల నాయకులు నగరంలో సంబరాలు జరుపుకున్నారు. బుధవారం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, పవన్ కల్యాణ్, టీడీపీ, బీజేపీ, జనసేన ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయడంతో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. జిల్లా నుంచి పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డి మంత్రులు పదవీ స్వీకార ప్రమాణం చేయడంతో వారు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ పెద్ద ఎత్తున వేడుకలు జరిపారు. రాష్ట్రానికి మంచి రోజులు వచ్చాయని, అభివృద్ధి పథం ఆంధ్రప్రదేశ్ నడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



కోవూరు : ఆర్టీసీ బస్సుల్లో బయలుదేరుతున్న కూటమి కార్యకర్తలు

కోవూరు, జూన్ 12 : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయడంతో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. ఈ ప్రమాణ స్వీకారానికి కోవూరు నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బుధవారం తెల్లవారుజామున బస్సులు, కార్లల్లో బయలుదేరి వెళ్లారు. జిల్లాకు చెందిన ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ ప్రమాణ స్వీకారం చేస్తున్నారని తెలిసి నియోజకవర్గ పరిధిలోని వారి అభిమానులు పెద్దసంఖ్యలో గన్నవరానికి బయలుదేరారు. ప్రమాణస్వీకారోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

ఇందుకూరుపేట : చంద్రబాబు నాల్గోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం చాలా ఆనందంగా ఉందని రాష్ట్ర టీడీపీ కార్యకర్త వీరేంద్ర చౌదరి పేర్కొన్నారు. ఇందుకూరుపేటలో జరిగిన కార్యక్రమంలో సూదులగుంట నాగార్జుననాయుడు, మాదాల రాంప్రసాద్, మాదాల రమేష్‌నాయుడు, గోళ్ల మోహనకృష్ణ, సుదులగుంట రఘురామనాయుడు, విజయ్, సంగారు మహేష్, గోళ్ల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు : రాష్ట్రాభివృద్ధి చంద్రబాబునాయుడికే సాధ్యపడుతుందని టీడీపీ సీనియర్ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, బెజవాడ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా విడవలూరులోని కామాక్షీనగర్‌లో టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి బాణాసంచాలు కాల్చారు. స్వీట్లు పంచిపెట్టారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో మండలాన్ని అన్నివిధాలుగా ప్రగతి పథంలో నడుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చెముకుల శ్రీనివాసులు పొన్నలూరు పురంధర్‌రెడ్డి, చలంచర్ల కామేశ్వరమ్మ, బండి మల్లి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : ముఖ్యమంత్రిగా 4వసారి చంద్రబాబు చేసిన ప్రమాణస్వీకాన్ని మండలంలోని వందలాదిమంది ప్రజలు, పలువురు అధికారులు బుచ్చిలోని ఎంఎం ఫంక్షన్‌హాల్‌లో వీక్షించారు. ప్రజలకు అధికారులు బిస్కెట్లు, టీ అందజేశారు. తహసీల్దారు, ఎంపీపీ, ఎంపీడీవో, నగర పంచాయతీ కమిషనర్ ఏర్పాట్లు పరిశీలించి కార్యక్రమంలో పాల్గొన్నారు. తహసీల్దారు ఎంపీడీవో, నగర పంచాయతీ కార్యాలయాలను విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో దొడ్ల కోదండరామిరెడ్డి, గుత్తికొండ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో వెయ్యి మందికి బిస్కెట్ ప్యాకెట్లు, 500 మందికిపైగా స్థానిక ప్రజలు, పాదచారులు, వాహనచోదకులకు లడ్డూలు పంపిణీ చేశారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అరుణ్, సాయి, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



బుచ్చి : ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



ఇందుకూరుపేట : కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

సీఎం ప్రమాణ స్వీకార సంబరాలు

రాపూరు(డక్కిలి), జూన్ 12 : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం విజయవాడలోని కేసరపల్లిలో ప్రమాణ స్వీకారం చేయడంతో రాపూరులో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. రాపూరు, పంగిలి గ్రామాల్లో టీడీపీ నాయకులు కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచి పెట్టారు. రాపూరులో టీడీపీ మైనార్టీ సెల్ నాయకుడు ముక్తార్ ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. పంగిలిలో టీడీపీ కార్యకర్త నంద్యాల కోటేశ్వరరావు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. అలాగే వెంకటగిరి ఎమ్మెల్యేగా రామకృష్ణ, మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి ప్రమాణ స్వీకారాన్ని ప్రజలు ఆనందంగా వీక్షించారు.

మైపాడులో టీడీపీ శ్రేణుల సంబరాలు



ఇందుకూరుపేట : ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల విజయానికి కృషి చేసిన టీడీపీ యువ నాయకుడు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి బుధవారం స్వగ్రామం మైపాడుకి రావడంతో టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికి సంబరాలు జరుపుకున్నారు. మేళతాళాలతో బాణాసంచాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తనవెంట నడిచిన ప్రతి కార్యకర్తను ఆదుకుంటానని, ప్రతి ఒక్కరికీ అందుబాటు లో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మైపాడు శివాలయం చైర్మన్ సురేంద్ర, పామంజి నరసింహులు, పీఎల్‌రావు, అమ్మ హేచరీస్ అధినేత దుర్గా శంకర్‌రెడ్డి, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

వ్యాపారుల హర్షం

నెల్లూరు (సాంస్కృతికం): చంద్రబాబు ముఖ్యమంత్రిగా, రామనారాయణరెడ్డి, పీ నారాయణ మంత్రులు ప్రమాణ స్వీకారం చేయడంపై ఏపీ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ప్రధాని కార్యదర్శి, నెల్లూరు జిల్లా రైస్ క్యాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పేగు షణ్ముఖరావు, ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ పాన్ బ్రోకర్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు అమరా మోహన్‌రావు, కార్యదర్శి ఎంపీ ఆంజనే యులు, కోశాధికారి కొనగళ్ల శోభన్‌బాబు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు. 44వ డివిజన్‌లో టీడీపీ నేతలు బాణాసంచా పేల్చి స్వీట్లు పంచారు. దర్శి హరికృష్ణ, కోట మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం



ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నెల్లూరు(వైద్యం), జూన్ 12 : రాష్ట్రంలో ఐదేళ్ల అరాచక పాలనకు టీడీపీ చరమగీతం పాడిందని ఆ పార్టీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. కూటమి అధికారం చేపట్టిన సందర్భంగా బుధవారం నర్తకీ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ శ్రేణులు పూలమాల వేసి హర్షం వెలిబుచ్చారు. ధర్మవరం మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించటం, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ మంత్రులుగా ప్రమాణం స్వీకారం చేయటంతో పార్టీలో సంబరాలు మిన్నంటాయన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డాక్టర్ గణేష్ కుమార్, కల్వకుంట భాస్కర్, రెహమాన్, కోటిపాటి రాజా, అద్దంకి చంద్ర, సిద్ద కళాచారి, సుధా పాల్గొన్నారు.

జనసేన నాయకుల వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 12 : పవన్ కల్యాణ్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని మూడో డివిజన్ ప్రశాంతినగర్‌లో ఉన్న ఆంజనేయస్వామి గుడి వద్ద జనసేన నాయకులు కేదారి మనోజ్, బత్తల శ్రీకాంత్, గుత్తి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. 1001 టెంకాయలు కొట్టి, ఆకు పూజ, ప్రసాద వితరణ చేశారు. ముఖ్య అతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చిల్లూరు సుందర్ రామిరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో శీను ముదిరాజ్, జనసైనికులు, నాయకులు పాల్గొన్నారు.

● అన్నదానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : పవన్ కల్యాణ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా నగరంలోని ఆమని గార్డెన్స్ వద్ద బుధవారం అన్నదానం చేశారు. పార్టీ యువనేత నూనె రిషికేష్ యాదవ్ మాట్లాడుతూ పవన్ పాలనలో ప్రజలకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వితపు లలితారామ్, జనసేన పార్టీ నాయకులు సుందర్ రామిరెడ్డి, పవన్, సూరి తదితరులు పాల్గొన్నారు.

మంచి పేరు తెచ్చేలా పనిచేస్తాం

నెల్లూరు(హరనాథపురం) : చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, మంత్రులుగా ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ ప్రమాణ స్వీకారం చేయటం ఆనందదాయకమని వైద్యశాఖ ఉద్యోగుల సంఘం హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చే విధంగా ఉద్యోగులందరూ విధులు నిర్వహిస్తారని తెలిపారు.

క్రైస్తవ సమైక్య వేదిక శుభాకాంక్షలు

ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన చంద్రబాబు నాయుడుకు నెల్లూరు జిల్లా క్రైస్తవ సమైక్య వేదిక తరఫున శుభాకాంక్షలు తెలుపుతున్నామని నెల్లూరు బాప్టిస్టు మిషనరీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ దాసరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న చర్చి పాస్టర్లకు ఇస్తున్న రూ.5వేల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచాలని కోరారు. అర్హత గల పాస్టర్లకు గుర్తింపుకార్డులు, ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇళ్లు కట్టించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న జనసైనికులు

వాడవాడలా సంబరాలు

మనుబోలు, జూన్ 12: జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేయడంతో జనసైనికులతోపాటు టీడీపీ, బీజేపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఆటోసెంటర్ వద్ద జనసేన జెండాను ఆవిష్కరించి బాణాసంచా కాల్చి కేక్ కట్ చేశారు. జనసేన అధ్యక్షుడు పెనుబాక ప్రసాద్, జాకీర్, పవన్, శ్రీకాంత్, ఖాదర్‌వల్లీ, కోటేశ్వర్‌రెడ్డి, ఉదయ్, టీడీపీ నాయకులు సాని వెంకటరమణయ్య, దండు చంద్రశేఖర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు ఇరగరాజు వెంకయ్య పాల్గొన్నారు.

మండలంలోని మడమనూరులో టీడీపీ నాయకులు ఇంటింటా స్వీట్లు పంచిపెట్టారు. తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి నూనె లక్ష్మయ్య, ఉడతావిజయ్ కుమార్, పముజుల నాగరాజు, చెమిర్తి సుధీర్, తారకేశ్వర్‌రెడ్డి, మౌసంసాహెబ్, వెంకటేష్, శరత్‌కుమార్, ఉడతామధు, బీజేపీ నేత అజయ్‌కుమార్ పాల్గొన్నారు.



మనుబోలు : కేక్ కట్ చేస్తున్న జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు

పొదలకూరు: చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారంతో పట్టణంలోని సంగంరోడ్డు కూడలిలో నాయకులు బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. జై చంద్రన్న, జైజై సోమిరెడ్డి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కోవూరు బక్కయ్యనాయుడు, పిడుగు సుధా, దేవినేని శరత్‌బాబు, సాధమ్ గిరీష్, మలిసేని వెంకటేష్, జువ్వలగుంట బాలచంద్ర, ఆదాల మురళి, అలిమెలి సునీల్, ఐతా రవి, రాపూరు బాబు, తదితరులు పాల్గొన్నారు. కాకాణి రమణారెడ్డి కాలనీలో సంబరాలు అంబరాన్నంటాయి. రాపూరు బాబు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.

101 టెంకాయలతో మొక్కు చెల్లింపు

పట్టణంలోని యాదవవీధి, శివాలయం వీధిలోని టీడీపీ నాయకులు శివాలయంలో 101 టెంకాయలను కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రామ్‌నగర్ గేట్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. పట్టణ మాజీ అధ్యక్షుడు కొత్తా సుబ్బయ్య, దాసరి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. నాయకులు పునప సుబ్బయ్య, మల్లెంకొండ సుధా, దాసరి చంద్రానాయుడు, మన్నవరపు వినోద్‌కుమార్‌యాదవ్, యరగర్ల రాము, రాయదుర్గం సురేష్, రాయదుర్గం మహేష్, బొద్దు గురుస్వామి, పొదలకూరు నవీన్‌నాయుడు, ఐతా సురేష్, ఐతా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా మండలంలోని చెముడుగుంట వద్ద ఉన్న శ్రీడ్స్ కళ్యాణమండపంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, ఉపాధ్యక్షుడు చల్లా నాగార్జున్‌రెడ్డి, తెలుగురైతు రాష్ట్ర ప్రధానకార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు, నియోజకవర్గ రైతు నాయకుడు పద్మనాభనాయుడు తదితరులు, అధికారులు, కూటమి పార్టీల శ్రేణులు వీక్షించాయి.

తోటపల్లిగూడూరు: చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా మండలంలోని సౌత్ ఆములూరు, నరుకూరు, చింతోపు గ్రామాల్లో బుధవారం సంబరాలు అంబరాన్నంటాయి. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాగుంట రమణారెడ్డి, కొణతం రఘుబాబు, పైనం మాధురి, దేవరాల ప్రవీణ్, లాలా చంద్రశేఖర్, పైనం కోటేశ్వరరావు, పాకం వెంకయ్య, సమంతరెడ్డి, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే నారాయణే : టీడీపీ నేత కోటంరెడ్డి

నెల్లూరు(వైద్యం), జూన్ 12 : అభివృద్ధి అంటే పొంగూరు నారాయణే అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు. బుధవారం రాష్ట్ర మంత్రులుగా నారాయణ, ఆనం రామనారాయణరెడ్డి ప్రమాణం చేసిన సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో టీడీపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. 6వ డివిజన్, బాలాజీనగర్, నర్తకి సెంటర్‌లో వేడుకలు జరిగాయి. కొండా ప్రవీణ్ శంకర్ ఆధ్వర్యంలో ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. పొంగూరు నారాయణ అనే నేను అంటూ మంత్రిగా ప్రమాణం చేస్తుండగా టీడీపీ నేతలు, కార్యకర్తలు ఈలలు.. కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచుకున్నారు. కేక్‌కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, గుత్తా అన్నపూర్ణ, రామకృష్ణ, సాయికిరణ్, నరహరి, శ్రీహరి, గురుకిశోర్, గురుబ్రహ్మం, శేగు షణ్ముగం తదితర టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట

● స్వర్ణభారతి విద్యామందిర్ ప్రిన్సిపాల్ సులోచన

వెంకటాచలం, జూన్ 12 : భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు స్ఫూర్తితో స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపావెంకట్ ఆధ్వర్యంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో నడుస్తున్న స్వర్ణభారతి విద్యామందిర్ పాఠశాల భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తుందని పాఠశాల ప్రిన్సిపాల్ సులోచన తెలిపారు. బుధవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేసవి సెలవుల తర్వాత పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు.

విద్యుత్ అక్రమంగా వాడితే చర్యలు

మనుబోలు, జూన్ 12: అక్రమ విద్యుత్ వాడితే తప్పనిసరిగా కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏఈ నాగార్జున బుధవారం అన్నారు. చెర్లోపల్లి గ్రామంలో రఘురామయ్య అనే వ్యక్తి తన ఇంటికి అక్రమంగా విద్యుత్ కనెక్షన్‌తో ఏసీ వాడుతున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యుత్ సిబ్బంది దాడులు చేసి అక్రమంగా విద్యుత్ వాడుతున్న రఘురామయ్యపై కేసు నమోదు చేసి జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

డాక్టర్ శేషారెడ్డికి ఘన నివాళులు

కోవూరు, జూన్ 12: నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి పీపుల్స్ పాలీ క్లినిక్ బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ జెట్టి శేషారెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక సీతాపోలయ్య భవనంలో బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞానవేదిక జిల్లా నాయకుడు పుల్లయ్య మాట్లాడుతూ ఎన్నో సైన్సు సామాజిక ఉద్యమాలకు శేషారెడ్డి చేయూత నందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు రహంతుల్లా, ఖాజావలీ, గండవరపు శేషయ్య, హరి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



శేషారెడ్డికి జోహార్లు అర్పిస్తున్న నాయకులు

'ఎన్ఎంసీ యోజన'తో తాగునీటి పర్యవేక్షణ : కమిషనర్

నెల్లూరు(సిటీ), జూన్ 12 : నగరంలోని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్ర స్థాయిలో ఎన్ఎంసీ యోజన తో పర్యవేక్షించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజనీరింగ్, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థ ద్వారా తాగునీటి సరఫరాను పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తామని, లోపాలను గుర్తిస్తామని చెప్పారు. నీరు సరఫరా అయ్యే వీధులు, ఇళ్లు, వాటి యజమానుల వివరాలు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. నగర పాలక సంస్థ నీటిని తీసుకునే వారికి అధికారిక కనెక్షన్ ఉందా.. లేదా అనేది కూడా ఇందులో తెలిసిపోతుం దన్నారు. ఎక్కడైనా నీటి సరఫరాలో లీకేజీలున్నా పసికట్టవచ్చన్నా రు. ఈ కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాస సంజయ్, చంద్రయ్య పాల్గొన్నారు.

బాలకార్మికుల గుర్తింపునకు 30 వరకు తనిఖీలు



ర్యాలీలో అధికారుల బృందం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 12 : ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక వ్యవస్థ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఈ నెల 30వ తేదీ వరకు బాలకార్మికుల గుర్తింపు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఉప కమిషనర్ ఇన్‌చార్జి పీ అనిల్ కుమార్ తెలిపారు. బుధవారం పొట్టి శ్రీరాములు బాలకార్మిక నిర్మూలన టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు, సంబంధిత అనుబంధ శాఖ అధికారుల బృందం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించింది. ఇది గాంధీబొమ్మ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు సాగింది. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

జర్నలిస్టు సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 12 : జగన్ రాక్షస పాలనలో జర్నలిస్టు కుటుంబాలు వీధిన పడ్డాయని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రైల్వే పాసులు పునరుద్ధరించాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఐక్యవేదిక నాయకులు కోరారు. బుధవారం జర్నలిస్టు భవన్‌లో ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ పాశం నరసింహారావు, కో కన్వీనర్ ఎన్ శ్రీహరి, సలహాదారు ఏ వెంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసినందుకు శుభాకాంక్షలు తెలిపారు. మండల కేంద్రాల్లో శాశ్వత జర్నలిస్టు భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. విధి నిర్వహణలో మరణించిన జర్నలిస్టు కుటుంబానికి రూ.25లక్షల పరిహారం అందించాలన్నారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు స్కూళ్లలో శాశ్వత రాయితీ కల్పించాలని, వెటరన్ జర్నలిస్టులకు పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత హాస్టల్ వసతికి 14 నుంచి దరఖాస్తుల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 12 : పేద ఆర్యవైశ్య విద్యార్థులకు ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పించేందుకుగాను ఈనెల 14 నుంచి దరఖాస్తుఫారాలు పంపిణీ చేస్తున్నట్లు నెల్లూరు పప్పులవీధిలోని పాండురంగ అన్నదాన సమాజం కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 21 వరకు స్వీకరిస్తామని సమాజం కార్యదర్శి వైభవ్ శ్రీనివాస్, హాస్టల్ కమిటీ చైర్మన్ వాయుగుండ్ల హజరత్తయ్య తెలిపారు. తుది జాబితా ఈనెల 25న ప్రకటిస్తామని పేర్కొన్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ

నెల్లూరు (విద్య), జూన్ 12 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వేసవి క్రీడాశిక్షణ శిబిరాల్లో సాధన చేస్తున్న క్రీడాకారులకు వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, దాతలు డాక్టర్ దొరస్వామి నాయుడు, హైటెక్ రమణారెడ్డి పాల్గొన్నారు.

43వ డివిజన్‌లో అన్నదానం

నెల్లూరు(సిటీ) : రాష్ట్ర మంత్రివర్గ ప్రమాణ స్వీకారం సందర్భంగా 48వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి ఇంతియాజ్ ఆధ్వర్యంలో 43వ డివిజన్ మున్సిపల్ మస్టర్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి, పారిశుధ్య కార్మికులకు అన్నదానం చేశారు. ఇంతియాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జర్న లిస్టులకు మంచి రోజులు వచ్చాయన్నారు. ముందస్తు బక్రీద్ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జర్నలిస్టు నయీంఖాన్, టీడీపీ నాయకులు రఫీఅహ్మద్, శ్రీదేవి పాల్గొన్నారు.



తిరుపతి విమానాశ్రయంలో టీడీపీ శ్రేణులకు చంద్రబాబు అభివాదం- తిరుమలలో టీడీపీ కార్యకర్తలను పలకరిస్తున్న లోకేశ్- గాయత్రి నిలయం అతిథి గృహానికి వెలుతున్న నారా బ్రాహ్మణి, నారా భువనేశ్వరి







తిరుమలను భ్రష్టు పట్టించారు బాబూ!

ఎన్టీఆర్‌లా ప్రక్షాళన చేయండి

చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో తిరుమల భక్తులంతా ఊపిరి పీల్చుకున్నారు. జగన్ పాలనలో పవిత్రమైన క్షేత్రాన్ని రాజకీయ నేతల వ్యాపార కేంద్రంగా మార్చేసిన తీరును తలచుకుంటున్నారు. సాధారణ భక్తులకు దర్శనం దుర్లభం అయిపోగా నాయకులు మాత్రం గుంపులతో వచ్చిపోయే తీరు క్యూలో పదుల గంటలు వేచివుండే భక్తుల కడుపు మండించేది. భక్తులకు ఎంతో ప్రీతిపాత్రమైన లడ్డూనే నాసిరకంగా మార్చేసి, ధర పెంచేసిన వైనంపై ఈ ఐదేళ్లలో భక్తులు మండిపడుతూనే ఉన్నారు. కాటేజీల ధరలు పెంచి లాడ్జీల్లా మార్చేసి మధ్య తరగతిని అవస్థల పాలు చేశారు. తిరుమల కొండమీద జగన్ పాలనలో పీఆర్వోల పేరుతో దళారుల రాజ్యం విచ్చలవిడిగా కొనసాగింది. మంత్రులూ, బోర్డు సభ్యులే దర్శనాల వ్యాపారాలకు తెగబడ్డారనే విమర్శలు పెరిగాయి. వైసీపీ నేతలకు కమీషన్ల కోసం వేల కోట్ల నిధులను నిర్మాణాల పేరుతో కేటాయించేసి అధికారులు ప్రభుభక్తిని చాటుకున్నారు. ఇప్పుడు ఇవన్నీ చర్చగా మారాయి. ఎన్టీఆర్ లా తిరుమల ప్రక్షాళనకు చంద్రబాబు శ్రీకారం చుడతారనే ఆశ అందరిలో పెరిగింది. ఐదేళ్లలో తిరుమల కేంద్రంగా సాగిన అరాచకాలనూ.. అవినీతినీ.. అడ్డగోలు నియామకాలనూ నిశితంగా పరిశీలించి, సరిదిద్దుతారనే ఆకాంక్ష భక్తుల్లో ఉంది. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ వారి దర్శనాల వ్యాపారం

టీడీపీ పాలనలో: ఎమ్మెల్యేల నుంచి రోజుకు ఒక సిఫారసు లేఖను మాత్రమే అనుమతించేవారు. అదీ ఆరుగురికి మాత్రమే దర్శనం కేటాయించేవారు. ఎమ్మెల్యేలు స్వయంగా దర్శనానికి వెళితే మాత్రం పది మందిని అనుమతించేవారు. మంత్రులైతే రోజుకు రెండు లేఖలు అనుమతించేవారు. బోర్డు సభ్యులకు రోజుకు 30టికెట్లు కోటా వుండేది. వారాంతపు రోజుల్లో 12 టికెట్లు ఇచ్చేవారు. చైర్మన్‌కు కనిష్ఠంగా వంద నుంచీ గరిష్ఠంగా 150 టికెట్లు కేటాయించేవారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప సుపథం టికెట్లు ఇచ్చేవారు కాదు.

వైసీపీ హయాంలో: ఎమ్మెల్యే లేఖలపై టికెట్లను రోజుకు ఆరు నుంచీ పదికి పెంచేశారు. స్వయంగా వెళితే 20 నుంచీ 30 టికెట్లు ఇచ్చారు. మంత్రులకు రెండు లేఖలనే అనుమతించినా టికెట్ల సంఖ్యపై పరిమితి లేదు.ఎన్ని అడిగినా ఇచ్చేవారు. మంత్రి స్వయంగా వెళితే 60 నుంచీ 70 టికెట్లు జారీ చేశారు. ఇక బోర్డు సభ్యులకు ఇచ్చే టికెట్లు 35కు పెంచారు. చైర్మన్ కార్యాలయం నుంచీ రోజుకు 500 నుంచీ వెయ్యి టికెట్లు ఇచ్చారు. బ్రేక్ దర్శన టికెట్లు అయితే పరిమితి అన్నదే లేకుండా పోయింది. ఎన్ని అడిగితే అన్ని ఇచ్చారు. గతంలో మొత్తం బ్రేక్ దర్శన టికెట్లు రోజుకు 2 వేల నుంచీ 3 వేల వరకూ ఇస్తుండగా వైసీపీ వచ్చాక 6 వేలకు పెంచారు.

పుట్ట గొడుగుల్లా హాకర్లు

వైసీపీ అధికారంలోకి వచ్చాక తిరుమలలో హాకర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చారు. ఎలాంటి లైసెన్సులు లేకపోయినప్పటికీ వైసీపీ నేతల అండదండలతో అనధికారికంగా తట్టలు పెరిగిపోయాయి. షాపింగ్ కాంప్లెక్స్, వరాహస్వామి కాంప్లెక్స్, వైకుంఠం, సప్తగిరి, అన్నదాన సత్రం, యాత్రికుల సముదాయం వంటి ప్రాంతాల్లో వందల కొద్దీ తట్టలు ఏర్పాటు చేసుకున్నారు. ఇందువల్ల అటు టీటీడీ అధికారులకూ, ఇటు వైసీపీ నేతలకూ కోట్లు ముడుతున్నాయనే ఆరోపణలున్నాయి.

క్యూ లైన్లలో అన్న పానీయాల కొరత

గతంలో క్యూలైన్లలో భక్తులకు ఎప్పటికప్పుడు తాగునీరు, మజ్జిగ, పాలు వంటి పానీయాలతో పాటు సాంబారు అన్నం, టిఫిన్లు అందించే వారు. ఇప్పుడవి సక్రమంగా అందడం లేదు. చిన్నపిల్లలు, వృద్ధులతో పాటు మధుమేహం వున్న వారితో వస్తున్న కుటుంబాలు క్యూలైన్లలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

అయినవాళ్లకు అన్‌లిమిటెడ్

వైసీపీలోనూ పలుకుబడి ఉన్న నేతలు, టీటీడీ ఈవోతో సన్నిహితంగా ఉండే ఎమ్మెల్యేలు, మంత్రులు, బోర్డు సభ్యులకు దర్శన టికెట్లపై కోటా అన్నదే లేదు. ఉదాహరణకు గత ప్రభుత్వంలో సీఎంకు సన్నిహితుడిగా పేరుపడ్డ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే నుంచి రోజుకు 16-17 లేఖలను అనుమతించేవారు. అదే సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర బలహీన వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు, బోర్డు సభ్యులకు సాధారణ కోటా మేరకు మాత్రమే లేఖలను అనుమతించి పరిమితంగా టికెట్లు కేటాయించేవారు.

దుకాణాలు తెరిచేశారు

కొందరు మంత్రులు, పాలకమండలి సభ్యులు దర్శనాల పేరిట కొండపై దుకాణాలే తెరిచేశారు. టికెట్లు భారీ ఎత్తున అమ్ముకునేవారని ఆరోపణలున్నాయి.ఓ మహిళా మంత్రి సహా నలుగురైదుగురు మంత్రులు తరచూ పార్టీలను వెంటబెట్టుకుని తిరుమలకు వచ్చేవారు. జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా దర్శనాలను వ్యాపారంగా మార్చుకున్నారన్న ఆరోపణలున్నాయి.

పీఆర్వోల పేరుతో దళారీలు

ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, బోర్డు సభ్యులు.. ఇలా ప్రతి ఒక్కరికీ కొండపై ప్రైవేటు పీఆర్వోలు వున్నారు. దాతలు నిర్మించిన అతిథి గృహాలు ప్రైవేటు పీఆర్వోలకు, దళారీలకు కేంద్రాలుగా మారాయి. రూ. కోట్లు వెచ్చించి అత్యంత విలాసవంతంగా నిర్మించిన అతిథి గృహాలలో ఒక ఫ్లోర్ మొత్తం దాతలకు, వారు సూచించిన వ్యక్తులకు కేటాయించేశారు. దాంతో వాటి నిర్వహణ ప్రైవేటు వ్యక్తులు చూస్తున్నారు. అలా ఒకో అతిథి గృహంలో 10 నుంచీ 20 మంది దాకా నిర్వహణ కోసం అనే వంకతో సిబ్బందిని నియమించారు. వారు దళారీలుగా మారి దర్శనాలు, గదుల కేటాయింపులో నిమగ్నమవుతున్నారు. ఇందువల్ల ఇవి పుణ్యక్షేత్ర వాతావరణాన్ని కోల్పోయి విలాస కేంద్రాలుగా మారాయన్న ఆరోపణలున్నాయి.

సలహాదారులు..అడ్డగోలు నియామకాలు

వైసీపీ హయాంలో ఆ పార్టీ నేతలకు కావాల్సిన వారిని అధికారులుగా, సలహాదారులుగా, ఉద్యోగులుగా అడ్డగోలుగా నియమించుకున్నారు. ఉద్యోగులను, అధికారులను కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించగా, సలహాదారులను మాత్రం భారీ జీతభత్యాలతో నేరుగా నియమించారు. గతంలో టీటీడీలో ఎన్నడూ సలహాదారుల విధానం లేదు. ఉదాహరణకు అకౌంట్స్ విభాగానికి నరసింహమూర్తిని, ఇంజనీరింగ్ విభాగానికి కొండలరావును, అదే విభాగానికి రిటైర్డు చీఫ్ ఇంజనీర్ రామచంద్రారెడ్డిని సలహాదారులుగా నియమించారు. బర్డ్ ఆస్పత్రికి డాక్టర్ గురవారెడ్డిని సలహాదారుగా నియమించారు. విజిలెన్స్ విభాగంలో ప్రభాకర్ సలహాదారుడయ్యారు. సైబర్ విభాగానికి సందీప్ అనే వ్యక్తిని సైబర్ ఎక్స్‌పర్ట్‌గా నియమించి తర్వాత ఏకంగా ఐటీ విభాగానికి జనరల్ మేనేజర్‌గా నియమించారు. తొలుత రెండేళ్ళ కాల పరిమితి విధించి అది పూర్తి కావడంతో మరో మూడేళ్ళు పొడిగించారు. కీలకమైన ఎస్టేట్ విభాగంలో కూడా రిటైరైన అధికారి మల్లిఖార్జునను కొనసాగిస్తున్నారు. ఎస్వీబీసీకి సంబంధించి గాయని మంగ్లీ, విజయ్‌కుమార్ వంటి వారిని సలహాదార్లుగా నియమించారు. విద్యా శాఖలోనూ, ధర్మ ప్రచార పరిషత్‌లోనూ పలువురిని అడ్డగోలుగా నియమించారు. సలహాదారులకు రూ. లక్షకు పైగా వేతనం, వాహనం, వారికి గదులు కేటాయించి టీటీడీ ఖజానాను గుల్ల చేశారన్న ఆరోపణలున్నాయి. ప్రజాసంబంధాల విభాగంలో కూడా సాక్షి పత్రికలో పనిచేసిన నాగేశ్వరరావు అలియాస్ నగేష్‌ను ఓఎస్డీ హోదాలో నియమించారు. ఇటీవలి ఎన్నికల్లో అతను వైసీపీ ప్రచారంలో పాల్గొన్నా చర్యలులేవు. ఏపీఆర్వోగా కొనసాగుతూనే ఉండడం విశేషం.

కమీషన్ల కోసం నిర్మాణాలకు నిధులు

టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ హయాంలో ఇంజనీరింగ్ పనులకు భారీ ఎత్తున నిధుల కేటాయింపు జరిగింది. 2019 వరకూ ఏటా బడ్జెట్‌లో ఇంజనీరింగ్ పనులకు రూ. 150 కోట్లకు మించి కేటాయింపులు వుండేవి కావు. అవి కూడా తప్పనిసరి అవసరాలకు మాత్రమే కేటాయించేవారు. వైసీపీ హయాంలో మొత్తం ఐదేళ్లలో ఏకంగా రూ. 3 వేల కోట్లకు పైగా నిధులను ఇంజనీరింగ్ పనులకు కేటాయించడం సంచలనం రేపింది. పాలకమండలిలో కీలక వ్యక్తులు కమీషన్లకు ఆశపడినందునే ఇలా కేటాయింపులు జరిగాయన్న ఆరోపణలున్నాయి.చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి నాలుగేళ్ళ పదవీ కాలంలో రూ. వెయ్యి కోట్ల వరకూ కేటాయించగా భూమన కరుణాకర్‌రెడ్డి బోర్డు ఛైర్మన్‌గా పనిచేసిన ఏడాదిలోపే రూ.2 వేల కోట్ల కేటాయింపులు జరిగాయి. పర్సెంటేజీలు రాబట్టేందుకే అవసరం లేని నిర్మాణాలు కూడా ప్రతిపాదించారన్న ఆరోపణలున్నాయి. ఉదాహరణకు అంతకు మునుపే పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి బాగుపరిచిన గోవిందరాజస్వామి సత్రాలను పూర్తిగా కూల్చివేసి కొత్తగా నిర్మించేందుకు ఏకంగా రూ. 600 కోట్లు కేటాయించారు. అలాగే నిక్షేపంగా వున్న స్విమ్స్ భవనాలను తొలగించి కొత్తగా నిర్మించేందుకు రూ.300 కోట్లు కేటాయించారు. తిరుపతి నగరంలో రోడ్ల నిర్మాణానికి సైతం పెద్దమొత్తంలో నిధులు కేటాయించడం వివాదం అయ్యింది.

అలిపిరి నుంచే బాదుడు మొదలు

తిరుమల కొండమీద వైసీపీ పాలనలో ధర పెంచనిదంటూ ఏదీ మిగల్లేదు. అలిపిరి టోల్‌గేట్ నుంచే ఈ బాదుడు మొదలుపెట్టారు. 15 రూపాయలున్న కారు టోల్ ఫీజును ఏకంగా రూ.50కి పెంచేశారు. మినీ లారీ, మినీ బస్సులకు రూ. 50 నుంచీ రూ. వందకు పెంచారు.

లాడ్జీలతో పోటీపడేలా కాటేజీల అద్దెలు

కొండపై గతంలో పాంచజన్యం, కౌస్తుభం సముదాయాల్లోని గదుల అద్దె రూ. 500 చొప్పున, నందకంలోని గదుల అద్దె రూ. 600 చొప్పున వుండగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక రూ. వెయ్యి చేశారు. గతంలో 120 ఏసీ గదుల అద్దె రూ. వెయ్యి చొప్పున వుండగా రూ. 1500కు పెంచారు. అలాగే నారాయణగిరి 1, 2, 3 సముదాయాల్లో రూ. 150గా వున్న గదుల అద్దె ఒకేసారి రూ. 1700కు పెంచేశారు.4వ సముదాయంలో రూ. 750గా వున్న గదుల అద్దెను కూడా రూ. 1700కు పెంచారు. వాటిలోనే రూ. 200గా వున్న పెద్ద గదుల అద్దెను ఏకంగా రూ. 2200 చేశారు. స్పెషల్ టైప్ కాటేజీల అద్దెను సైతం రూ. 750 నుంచీ రూ. 2200కు, కొన్ని కార్నర్ సూట్లు రూ. 1500 నుంచీ రూ. 2800కు పెంచేశారు. ఇక వివిజీహెచ్ గదుల అద్దె రూ. 1500 నుంచీ రూ. 2200కు పెంచారు.పద్మావతీ అతిథి గృహాల ప్రాంతంలో రూ. వెయ్యి నుంచీ రూ. 3 వేల దాకా ఉండే గదుల అద్దెలు రూ. 6వేలకు చేరుకున్నాయి. సన్నిధానంలో గది అద్దె రూ. 6600 నుంచి రూ. 14 వేలకు పెంచేశారు.మరోవైపు తిరుపతిలోని శ్రీనివాస, పద్మావతీ కళ్యాణ మండపాల్లో అద్దె రూ. 6వేల నుంచీ 7వేల వరకూ వుండేది.ప్రస్తుతం శ్రీనివాస కళ్యాణ మండపాల్లో అద్దెలు రూ. 1.18 నుంచి రూ. 1.41 లక్షలు చేశారు.పద్మావతీ కళ్యాణ మండపాల్లో రూ.1.35లక్షలకు పెంచేశారు.

ప్రసాదాల ధరల పెంపు

వైసీపీ పాలనలో పవిత్రమైన తిరుపతి లడ్డూ కూడా భక్తులకు అందని స్థితికి చేర్చారు. లడ్డూ నాణ్యతపై భక్తులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

టీడీపీ పాలనలో: బ్రేక్ దర్శన టికెట్‌పై రెండు లడ్డూలు, అలాగే ఏ ఆర్జిత సేవకు వెళ్ళినా రెండు లడ్డూలు, రూ. 300 టికెట్ భక్తులకు రెండు లడ్డూలు, నడక దారిభక్తులకు ఒక లడ్డూ చొప్పున ఉచితంగా అందేవి. సర్వదర్శన భక్తులకు రూ. 10 ధరతో రెండు లడ్డూలు, రూ. 25 ధరతో రెండు లడ్డూలు చొప్పున ఇచ్చేవారు.

వైసీపీ హయాంలో: లడ్డూలపై సబ్సిడీ రద్దు చేశారు.శ్రీవారిని దర్శించుకునే ప్రతి ఒక్కరికీ ఉచిత లడ్డూ ఇచ్చే విధానం ప్రారంభించినా, అదనపు లడ్డూ ధరను రూ. 25 నుంచీ రూ. 50కి పెంచారు. రూ. 300 టికెట్, రూ. 500 బ్రేక్ దర్శన టికెట్‌లతో సహా సుప్రభాతం, అర్చన, తోమాల, ఆర్జిత సేవల టికెట్లపై గతంలో ఇస్తుండిన రెండు లడ్డూల్లో ఒక లడ్డూ కోత విధించారు. కళ్యాణోత్సవం టికెట్‌పై గతంలో కండువాతో పాటు పెద్ద లడ్డూ, వడ ఇవ్వగా ఇపుడు పెద్ద లడ్డూ, వడ ఇవ్వకుండా ఆ రెంటింటి బదులు చిన్న లడ్డూ ఒకటి ఇస్తున్నారు. తిరుప్పావై సేవ టికెట్ ధరను రూ. వంద నుంచీ రూ. 500కు పెంచేశారు.

అన్నదానంలో నాణ్యత ఏదీ?

రుచికి, శుచికి పేరుపడిన శ్రీవారి అన్న ప్రసాదాల్లో నాణ్యత కరువైందన్న ఫిర్యాదులు కూడా గత ఐదేళ్ళుగానే వస్తున్నాయి.ఉడకని అన్నం, పలుచని సాంబారు వంటివి భక్తుల అసంతృప్తికి కారణం అవుతున్నాయి.

ఉద్యోగులకూ అసౌకర్యం

టీటీడీ ఉద్యోగులు ఇదివరకూ తమ కుటుంబాలతో వేకువ జామున వీఐపీ బ్రేక్ సమయంలో దర్శనం చేసుకుని తిరిగి తమ విధులకు యధా ప్రకారం హాజరయ్యే వారు. ఇపుడు బ్రేక్ సమయం మార్చడంతో దర్శనం తర్వాత కనీసం ఒక పూట విధులకు హాజరు కాలేని పరిస్థితులు ఏర్పడ్డాయి.

తిరుచానూరులోనూ ధరల దరువు

తిరుచానూరు అమ్మవారి ఆలయంలోనూ పలు సేవల ధరలు పెంచి సదుపాయాల్లో కోత విధించారు. సుప్రభాత సేవ, ఏకాంతసేవ టికెట్ ధరలను రూ. 25 నుంచీ రూ. 50 చేశారు. సహస్ర నామార్చన సేవ టికెట్ రూ. 25 నుంచీ రూ. వందకు పెంచారు. తిరుప్పావడ సేవ టికెట్ ధర రూ. 600 నుంచీ రూ. వెయ్యికి పెంచారు. అభిషేక సేవ టికెట్ రూ. 400 నుంచీ రూ. 500 చేశారు. అభిషేకానంతర దర్శన టికెట్ రూ. 20నుంచీ రూ. 250కు పెంచారు. కళ్యాణోత్సవ టికెట్‌పై ఇదివరకూ భక్తులకు అన్నప్రసాదం ఇస్తుండగా దాన్ని ఎత్తేశారు. పుష్పాంజలి సేవ టికెట్‌పై ప్రసాదాలతో పాటు ఇచ్చే క్యారీ బ్యాగ్‌కు కోత విధించారు. కుంకుమార్చన టికెట్ రూ. 200 నుంచీ రూ. 250కి పెంచారు. ఆ టికెట్‌పై ఇద్దరికి బదులు ఒకరినే అనుమతిస్తున్నారు. రెండు లడ్డూల బదులు ఒక లడ్డూనే ఇస్తున్నారు.

బ్రేక్ వేళల మార్పుతో ఇబ్బందులు

తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం గతంలో వేకువజామున వుండేది. సుప్రభాతం, అర్చన, తోమాల సేవల సమయాల్లో కూడా సామాన్య భక్తులకు లఘు దర్శనముండేది. రాత్రి క్యూలైన్లలో వున్న భక్తులకు వేకువజామునే దర్శనం అయిపోయేది. నైవేద్యం తర్వాత వీఐపీ బ్రేక్ దర్శనాలు ముగించి తిరిగి 10 గంటల నుంచీ సర్వ దర్శనం మొదలయ్యేది. వైసీపీ ప్రభుత్వంలో వీఐపీ బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయం 9గంటలకు మార్చడంతో మధ్యాహ్నం 2నుంచీ సర్వదర్శనం మొదలవుతోంది. వీఐపీలకు,సామాన్య భక్తులకు కూడా ఈ విధానం ఇబ్బంది కలిగిస్తోంది.దీనివల్ల వీఐపీలు రోజంతా గదులు ఖాళీ చేయడంలేదు.గదుల కొరత కూడా ఏర్పడుతోంది.



గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

నాయుడుపేట టౌన్, జూన్ 12: పట్టణంలోని అగ్రహారపేటలో ఓ ఆటో డ్రైవర్ ఉరివేసుకున్నాడు. అగ్రహారపేటలో నివాసం ఉంటున్న అమీర్‌బాషా (35) గతంలో రెండు వివాహాలు చేసుకుని వారిని వదిలిపెట్టి వేరే మహిళతో 3 సంవత్సరాల నుంచి సహజీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అమీర్‌బాషా మద్యానికి బానిస కావడంతో ఆ మహిళ కూడా వేరేదగ్గర ఉంటోంది. ఈక్రమంలో బుధవారం ఉదయం అమీర్‌బాషా ఉండే ఇంటికి ఆ మహిళ చేరుకుంది. రేకుల ఇంటికి ఉన్న ఐరన్‌పైపుకు అమీర్‌బాషా ఉరివేసుకున్నట్లు గుర్తించింది. హుటాహుటిన స్థానికుల సాయంతో ఆయన్ను కిందకు దించి వైద్యశాలకు తరలించింది. అయితే అమీర్‌బాషా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఆవును ఢీకొన్న బైక్: ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడ్డ చంద్రశేఖర్

దొరవారిసత్రం, జూన్ 12: మండల కార్యాలయాల కూడలి సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం రహదారి దాటుతున్న ఆవును మోటరు సైకిల్ ఢీ కొనింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న తండ్రీకొడుకులు బి.చెంగయ్య, చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిది తడ మండలం మిట్టకండ్రిగ. స్వగ్రామం నుంచి నాయుడుపేటకు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ సాయంతో నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని చెన్నైకు తీసుకెళ్లారు. వారిలో చంద్రశేఖర్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానిక పోలీసులు ప్రమాదంపై కేసు నమోదు చేశారు.

ఉచ్చూరివారిపాళెంలో కోటమ్మ ఉత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

కోట, జూన్ 12: మండల పరిధిలోని ఉచ్చూరివారిపాళెంలో బుధవారం గ్రామదేవత కోటమ్మ అమ్మవారి ఉత్సవాలు జరిగాయి. కోటమ్మ ఆలయం నుంచి మేళతాళాలతో పుట్టింటి నగలు తీసుకెళ్లి అక్కడి ఉచ్చూరివారి పాళెం కోటమ్మకు అలంకరించారు. అనంతరం గంగపెట్టె, అమ్మవారి ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. కోటమ్మ ప్రధాన ఆలయంలో కోటమ్మను నెమలిపింఛాలతో అలంకరించారు. ఒక్కరోజు ఉత్సవాన్ని ఉచ్చూరివారిపాళెంవాసులు ఆర్భాటంగా నిర్వహించారు.

విద్యుదాఘాతంతో గేదె, దూడ మృతి

కోట, జూన్ 12: మండల పరిధిలోని కేశవరంలో బుధవారం విద్యుదాఘాతంలో గేదె, దూడ మృతి చెందాయి. కేశవరం గ్రామానికి చెందినచిరంజీవి తన గేదెతోపాటు దూడను మేత కోసం పొలానికి తోలుకెళ్లాడు. అక్కడ విద్యుత్ స్తంభం వద్ద మేస్తుండగా స్టేవైరు తగిలి రెండు జీవాలు మృత్యువాత పడ్డాయి.

ఎర్రచందనం స్వాధీనం: ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు

తిరుపతి(మంగళం), జూన్ 12: ప్రకాశం జిల్లా కొమరోలు మండలం చింతపల్లి అటవీ ప్రాంతంలో 107 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ చెప్పారు.ఆయన కథనం మేరకు... కడప సబ్ డివిజన్ ఆర్ఎస్ఐ నరేష్ టీం చింతపల్లి అటవీప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా సోమవారం రాత్రి భైరవ స్వామి తిప్ప వద్ద ఆటో, మోటారుసైకిల్ కనిపించాయి.పోలీసులను గమనించిన వారు పారిపోగా ఇద్దరిని మాత్రం పట్టుకోగలిగారు.తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌కు చెందిన రాజేంద్రకుమార్(41), ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం గడికోటకు చెందిన వాసం వెంకటసుబ్బయ్య(43)లుగా వారిని గుర్తించారు. వారి నుంచి 107 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్కు తీసుకువచ్చి బుధవారం ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేశారు.

అసలేం జరిగింది?

- ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచీ మంత్రివర్గంలో ఎవరికీ దక్కని స్థానం
- ముఖ్యనేతలకు సైతం అంతుబట్టని సమీకరణలు
- అందరి దృష్టీ ఖాళీగా వున్న ఒక బెర్త్‌పైనే

తిరుపతి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ళుగా ఎపుడెపుడా అని టీడీపీ శ్రేణులు ఎదురుచూసిన తరుణం రానేవచ్చింది. ఎన్నికల్లో టీడీపీ అద్భుత విజయం సాధించింది. రాష్ట్రంలో ప్రభుత్వమూ ఏర్పడింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేశారు. ఇవన్నీ శ్రేణులకు శుభ పరిణామాలే. అయితే మంత్రివర్గంలో జిల్లా నుంచీ ఎవరికీ చోటు దక్కకపోవడంతో తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు.ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచీ పలమనేరు ఎమ్మెల్యే నూతనకాల్వ అమరనాథరెడ్డి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిలకు తప్పనిసరిగా మంత్రి పదవులు లభిస్తాయని పార్టీ శ్రేణులతో పాటు రాజకీయ వర్గాలు, ప్రజానీకం కూడా అంచనా వేశాయి. ప్రాంతీయ, సామాజిక సమీకరణల రీత్యా ఇద్దరికీ సాధ్యపడకపోతే ఎవరో ఒకరికి తప్పక అవకాశం వస్తుందని బలంగా నమ్మారు. అయితే బుధవారం చంద్రబాబు ముఖ్యమంత్రిగా, 24 మంది మంత్రులుగా వెరసి 25మందితో రాష్ట్ర మంత్రివర్గం కొలువుదీరింది. 13 ఉమ్మడి జిల్లాల్లో ఒక్క చిత్తూరు జిల్లాకు మాత్రమే ప్రాతినిధ్యం కరువైంది. ఈ జిల్లా నుంచీ మాత్రమే మంత్రివర్గంలో ఎవరికీ స్థానం లేకపోవడానికి కారణాలేమిటన్న ప్రశ్న అందరినీ తొలిచేస్తోంది. ఉమ్మడి జిల్లా నుంచీ సీఎంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తుండగా మళ్ళీ మంత్రులు ఎందుకన్న ఉద్దేశం కావచ్చునన్న వాదన వినిపిస్తోంది. అలాగే సామాజికవర్గాల సమతుల్యతలో భాగంగా వీరిద్దరి కంటే సీనియర్లు, ముఖ్యమైన ఎమ్మెల్యేలకు ఇతర జిల్లాల్లో అవకాశం ఇచ్చినందున వీరికి అవకాశం తప్పిపోయిందన్న అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో ఇద్దరికీ ఇచ్చే పరిస్థితి లేదని, అలాగని ఎవరికి ఇచ్చినా మరొకరు మనస్తాపానికి గురయ్యే పరిస్థితుల్లో ఇద్దరికీ ఇవ్వలేదన్న వాదన కూడా వినిపిస్తోంది. అయితే ఇవేవీ పార్టీ నుంచీ అధికారికంగా వచ్చిన సమాచారాలు కాదు. కేవలం పార్టీ వర్గాల అంచనాలు మాత్రమే. దీంతో ఏ ప్రాతిపదికన జిల్లాకు మొండిచేయి చూపించారన్న ప్రశ్నకు సమాధానాలు దొరకడం లేదు.

ఆశలు రేకెత్తిస్తున్న ఖాళీ పదవులు

రాష్ట్ర మంత్రివర్గంలో గరిష్ఠంగా 26 మందిని తీసుకునే అవకాశముంది.చంద్రబాబు తలచుకుంటే మరొకరిని మంత్రిగా నియమించేందుకు అవకాశముంది. దీంతో ఇపుడు వెంటనే కాకపోయినా సమీప భవిష్యత్తులో ఆ ఖాళీగా వున్న బెర్తు జిల్లాకు దక్కుతుందన్న ఆశ జిల్లా పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. అలాగే అసెంబ్లీ స్పీకరు, డిప్యూటీ స్పీకరు, చీఫ్ విప్, నాలుగు విప్ పదవులు సైతం ఖాళీగా వున్నాయి. వీటిలో డిప్యూటీ స్పీకరు, చీఫ్ విప్, విప్ పదవులు సైతం క్యాబినెట్ మంత్రి హోదా కలిగినవే. ఇన్ని పదవులు ఖాళీగా వున్నందున జిల్లాకు చెందిన అమర్, కిషోర్‌లలో కనీసం ఒకరికి కీలక పదవి, మిగిలిన ఎమ్మెల్యేలలో ఒకరిద్దరికి ఇతర పదవుల్లో ఏవో ఒకటి లభిస్తాయన్న ఆశాభావం జిల్లా టీడీపీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఇంకా పదవులు, వాటిని భర్తీ చేసేందుకు ఇంకా సమయం వున్నందున అంతవరకూ వేచి చూసే ధోరణితో పార్టీ వర్గాలు సరిపెట్టుకుంటున్నాయి.

చంద్రబాబు ప్రమాణస్వీకార మహోత్సవ సంబరాలు


నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి పట్టణాల్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

నాయుడుపేట/ టౌన్, జూన్ 12: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో పట్టణంలో సంబరాలు మిన్నంటాయి. పట్టణంలోని బజారువీధిలో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. చేయూత ఆశ్రమంలో అన్నదానం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు ఏ. సుబ్రహ్మణ్యం, ప్రకాశం, షాజహాన్, మురళి, రాజా, రవి, భవాని, సంయుక్త, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: తమ పార్టీ అధినేత చంద్రబాబు సీఎం పదవీ ప్రమాణం చేసిన నేపథ్యంలో బుధవారం ఓజిలి మండల టీడీపీ నాయకులు పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో టీడీపీ నేతలు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు.

పెళ్లకూరు: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకారం మహోత్సవం సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అంతకుముందు కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి డి.నాగేంద్ర ప్రసాద్ రెడ్డి, టీడీపీ ఎన్నారై నాయకుడు పేరం వెంకటతేజ, సందీప్‌తేజ, రాజగోపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాధానాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: సీఎంగా చంద్రబాబు, మంత్రిగా పవన్‌కళ్యాణ్ ప్రమాణస్వీకారం చేయడంతో బుధవారం టవర్ క్లాక్ సెంటర్ వద్ద కూటమి నాయకుల సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు బాణసంచా పేల్చుతూ సందడి చేశారు. అలాగే టవర్ క్లాక్ భారీ స్క్రీన్‌ను ఏర్పాటు చేయడంతో కూటమి నాయకులతోపాటు పట్టణ ప్రజలు ప్రమాణస్వీకారాన్ని వీక్షించారు. అనంతరం అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు తానంకి నానాజీ, శీలం కిరణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించగా పి.శ్రీనివాసులు, ప్రకాష్‌రావు, వెంకటేశ్వర్లు, రవీంద్రారెడ్డి, ఎం.శ్రావణి, జి.లీలావతి, భారతి తదితరులు పాల్గొన్నారు. సంఘం థియేటర్ వద్ద, జీఎస్‌రాయులు సెంటర్‌లో, జనసేన కార్యాలయంలో కూటమి నాయకులు బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు.


సూళ్లూరుపేట టీడీపీ కార్యాలయం వద్ద, విద్యానగర్ సెంటర్‌లో, వాకాడులో టీడీపీ శ్రేణుల సంబరాలు

చిల్లకూరు: మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి, బాణ సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. వెంకటకృష్ణారెడ్డి, ఎం.కుమార్ యాదవ్, వెంకటేశ్వర్లు నాయుడు తదితరులు పాల్గొన్నారు.


పూలతోటలో వీక్షిస్తున్న ప్రజలు

బాలాయపల్లి: టీడీపీ అధినేత చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద క్లస్టర్ ఇన్‌చార్జి రాయి సత్యం నాయుడు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. అదేవిధంగా జయంపు గ్రామంలో టీడీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు.

వెంకటగిరి టౌన్: చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద టీడీపీ నాయకుల పి.రాజేశ్వరరావు, బి.రాజేశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్, జె.బాలకృష్ణ, ఎం.బాబు, కౌన్సిలర్ సుజాత, టి.చంద్ర కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అదే విధంగా టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళి రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ తంబిరెడ్డి రెడ్డి తనూజా, శివారెడ్డి, మధురెడ్డి, ఆధ్వర్యంలో పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సూళ్లూరుపేట: సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయడంతో బుధవారం సూళ్లూరుపేటలో తెలుగు తమ్ముళ్లు సంబరాలు చేసుకొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద బీసీ సెల్ నాయకులు పెరుమాల్ ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి స్వీట్లు పంచిపెట్టారు. అదే విధంగా చెరీస్ హోటల్ వద్ద దంతాల రవి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎ.రమేష్ సంబరాలు జరిగాయి. నాపా మునిరాజా, జి. రమేష్ రెడ్డి, బి.విజయలక్ష్మి, శారద, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవాన్ని వాకాడులో టీడీపీ మండల అధ్యక్షుడు డి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కూటమి నాయకులతో కలసి ఘనంగా నిర్వహించారు. అశోక్‌పిల్లర్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. గూడూరు నియోజక వర్గ బీజేపీ కన్వీనర్ పి.పురుషోత్తమరెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, జనార్దన రెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోట: మండలంలోని విద్యానగర్‌లో టీడీపీ తిరుపతి పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి, ఫిల్మ్ సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు వి.విజయ భాస్కర్‌రెడ్డి, రఘురామయ్య, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వి.వెంకట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ సెంటర్‌లో భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. చెందోడు సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్క రించారు. వెంకన్నపాళెంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తిన్నెల పూడిలో తెలుగుమహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు జి.సుష్మారెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్‌ను కట్ చేశారు. గూడలిలో కూడా బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

తడ: చంద్రబాబు ప్రమాణస్వీకార సందర్భాన్ని పురస్కరించుకొని తడలో తెలుగుతమ్ముళ్లు సంబరాలు జరుపుకున్నారు. కొండూరు, తడ, కారూరు, కాదలూరు గ్రామాల్లో టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా అధికారులంతా వీక్షించారు. తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ ఎంపీడీవో మురళీకృష్ణ, ఎంఈవో మల్లికార్జున, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దారు శరత్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని తిలకించేందుకు మండల ప్రజలు టీవీలను అతుక్కుపోయారు. గ్రామ సచివాలయాల్లో సచివాలయ సిబ్బంది కూడ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టి టీవీలను ఏర్పాటు చేసి జనాలకు చంద్రబాబు ప్రమాణ స్వీకా మహోత్సవాన్ని తిలకించేలా చేశారు. అధికార యంత్రాంగం అంతా కూడా చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని తిలకించారు. పూలతోటలో పలువురు యువత స్వీట్లు పంపిణీ చేశారు.

సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం


నాయుడుపేట అంబేడ్కర్ భవన్‌లో, ఓజిలి ఎంపీడీవో కార్యాలయంలో, దక్కిలిలో ప్రత్యక్ష ప్రసారాలు

ఓజిలి, జూన్ 12: టీడీపీ అధినేత చంద్రబాబు సీఎంగా పదవీ ప్రమాణ స్వీకార ప్రత్యక్ష కార్యక్రమాన్ని ఓజిలి మండల అధికారులు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఇందుకు తగిన ఏర్పాట్లను చేశారు. తహసీల్దారు నాంచారయ్య, ఎంపీడీవో శ్రీనివాసులుతోపాటు రెవిన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు కార్యదర్శులు, వెలుగు సిబ్బంది వీక్షించారు..

నాయుడుపేట/టౌన్: ప్రమాణస్వీకార మహోత్సవాన్ని తిలకించడానికి పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ జనార్దన రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉద్యోగులు, పొదుపు సంఘాల మహిళలు వీక్షించారు.

గూడూరు: గూడూరు పట్టణంలోని సీఆర్‌రెడ్డి కల్యాణమండపంలో మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో, మండల పరిషత్ కార్యాలయంలో డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రమాణ స్వకారాన్ని ప్రసారం చేశారు.

బాలాయపల్లి: సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని స్థానిక వెలుగు కార్యాలయంలో వీక్షించేందుకు స్క్రీన్ ఏర్పాటు చేశారు. తహసీల్దారు కె.పుల్లారావు, ఎంపీడీవో అరుణ, సీసీ శ్రీను, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారాన్ని వీక్షించేందుకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఆర్డీవో చంద్రముని, తహసీల్దార్ కేవి గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్‌తో పాటు అధికారులందరూ విచ్చేసి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని తిలకించారు. అదే విధంగా ఎంపీడీవో కార్యాలయంలో స్క్రీన్ ఏర్పాటు చేయగా పలువురు వీక్షించారు.

దక్కిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులు టీవీ ద్వారా సీఎం ప్రమాణ స్వీకారాన్ని తిలకించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో లీలామాధవి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చిట్టమూరు: చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు చిట్టమూరు బస్టాండ్ వద్ద డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు. టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. ప్రమాణ స్వీకారం సమయంలో వేదపండితుల ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం చిట్టమూరు నుంచి కొత్తగుంట వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. వి.గోపాల్‌రెడ్డి, దువ్వూరు మస్తాన్‌రెడ్డి, మారంరెడ్డి జనార్దన్‌రెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ శరత్‌చంద్రారెడ్డి, కామిరెడ్డి సునీల్‌రెడ్డి, బసిరెడ్డి హరికృష్ణారెడ్డి, గణపర్తి బాబునాయుడు, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, గణపర్తి గోపాల్‌నాయుడు, డి.మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చిట్టమూరు బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్

వెంకటగిరి ప్రజలతోనే ఉంటా: రాంకుమార్ రెడ్డి


సమావేశంలో ప్రసంగిస్తున్న రాంకుమార్‌రెడ్డి

వెంకటగిరిటౌన్, జూన్ 12: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తున్నానని వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్‌జేఆర్ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... ప్రజలు కూటమిని కోరుకున్నారన్నారు. వెంకటగిరిలో ఎమ్మెల్యేగా గెలుపొందిన కురుగొండ్లకు అభినందనలు తెలిపామన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, వెంకటగిరిని అభివృద్ధి చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా వెంకటగిరి అభివృద్ధికి టీడీపీ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండాలని, అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తామన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ అసత్యమని అటువంటి బూటకపు మాటలను ప్రజలు నమ్మవద్దన్నారు వైసీపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడితే సహించేది లేదన్నారు.